ప్రజాశక్తి

బుధవారం 18 సెప్టెంబర్ 2024   8 పేజీలు

ఎన్‌టిఆర్   కృష్ణా







భవానీ ఐలాండ్‌ను పరిశీలిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

దెబ్బతిన్న పర్యాటక ప్రాంతాల్లో పునరుద్ధరణ చర్యలు

మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడలో దెబ్బతిన్న పర్యాటక ప్రాంతాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. విజయవాడలో దెబ్బతిన్న భవానీ ఐలాండ్, బెరంపార్క్ తదితర పర్యాటక ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. బెరంపార్క్, భవానీ ఐలాండ్‌కు ఆయన బోటులో వెళ్లి దెబ్బతిన్న ప్రాంతాలను చూశారు. అధికారులను అడిగి వరద నష్టంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న భవానీ ఐలాండ్, బెరంపార్క్ తదితర పర్యాటక ప్రాంతాల్లో త్వరతగతిన పునరుద్ధరణ చర్యలు చేపడతామని వెల్లడించారు. వీలైనంత త్వరగా పూర్వ వైభవం తీసుకొస్తామని తెలిపారు. దెబ్బతిన్న పర్యాటక ప్రాంతాల్లో నష్టం అంచనా వేస్తున్నామని, త్వరలోనే నష్టంపై అధికారులతో చర్చించి పూర్తి స్థాయిలో నివేదిక తెప్పించుకొని చర్యలు చేపడుతామని చెప్పారు. మళ్లీ పర్యాటకం పుంజుకునేలా చేస్తామన్నారు. ఈ పర్యటనలో పర్యాటక శాఖ ఈడీ పద్మావతి, ఓఎస్డీ చైత్ర వర్షిణి, డివిఎం చైతన్య, ఏపీటీడీసీ ఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్లకు మోక్షం లభించేనా?

- అత్యవసర మరమ్మతుల రోడ్ల విస్తీర్ణం 212 కిలో మీటర్లు
- ప్రభుత్వ ఆమోదానికి ఎదురు చూపులు
- రోడ్ల నిర్మాణం, మరమ్మతుల బకాయిలు రూ.93 కోట్లు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు చేసిన కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయల మేర బకాయిలు పేరుకుపోయాయి. ఏడాదిన్నరగా కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు ఆన్‌లైన్ చేయలేదు. ఈనేపథ్యంలో తాజాగా 100 రోజుల్లో ఆర్ అండ్ బి రహదారుల గుంతలన్నీ పూడ్చాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు ఏ మేరకు అచరణలో అమల్లోకి వస్తాయనేది చర్చనీయాంశంగా మారింది.

అవనిగడ్డ - కోడూరు, పామర్రు-కొడాలి, కంకిపాడు - గుడివాడతోపాటు పలు ఆర్ అండ్ బి రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఆటో, ద్విచక్రవాహనదారులు ఈ రోడ్లపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర హైవేలు 27.66 కిలో మీటర్లు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు 162 కిలో మీటర్లు, ఇతర ధ్వంసమైన రోడ్లు 119 కిలో మీటర్ల మేర మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇలాగే కృష్ణా జిల్లాలో 212 కిలో మీటర్ల ఆర్ అండ్ బి రోడ్లకు అత్యవసర మరమ్మతులు చేయాల్సి ఉంది. దీనికిగాను రూ.14.41 కోట్లు అవసరమని జిల్లా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. టెండర్లు ఆహ్వానానికి ప్రభుత్వ ఫైనాన్స్ కమిటీ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నారు. కమిటీ ఆమోదం లభించగానే టెండర్లు ఆహ్వానించి రోడ్ల మరమ్మతులు చేయాల్సి ఉంది. ఏడాదిన్నరగా ఆన్‌లైన్ అవ్వని బిల్లులు

గత ప్రభుత్వ హయాంలో రహదారులకు మరమ్మతులు, నిర్మాణాలు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందకపోవడం సమస్యగా మారింది. కేంద్ర ప్రభుత్వ నిధులు (సిఆర్ఎఫ్), న్యూ



అధ్వానంగా తయారైన కంకిపాడు - గుడివాడ రోడ్డు

డెవలప్‌మెంట్ బ్యాంకు ఫండ్స్ (ఎన్‌డిబి) అత్యవసర మరమ్మతులు చేసిన రోడ్లకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పిహెచ్‌సి)లు నిర్మించిన కాంట్రాక్టర్లకు రూ.93 కోట్ల వరకు బకాయిలు చెల్లించాలి. అత్యవసర మరమ్మతులకు పలు పర్యాయాలు టెండర్లు ఆహ్వానించినా ఆర్ అండ్ బి రోడ్లకు టెండర్లు దాఖలు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఏడాదిన్నరగా కాంట్రాక్టర్‌ల బిల్లులు ఆన్‌లైన్ (టోకెన్) చేయలేదు. తాజాగా ఈ బిల్లులను ఆన్‌లైన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పెండింగ్ బిల్లులు విడుదలవుతాయని కాంట్రాక్టర్లు ఆశిస్తున్నారు. అయితే ఆర్ అండ్ బి రోడ్లకు టెండర్లు ఆహ్వానికి ముందే పెండింగ్ బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు. తద్వారా ఆర్ అండ్ బి రోడ్ల మరమ్మతులకు టెండర్లు దాఖలు చేయడానికి, వ్యయం చేయడానికి అవకాశం ఏర్పడుతుందని చెబుతున్నారు.

వరద బాధితుల నుండీ

కరెంట్ బిల్లుల వసూళ్లకు శ్రీకారం

- రెండు నెలలవి అక్టోబర్లో కట్టాలని ఎపిసిపిడిసిఎల్ తాఖీదులు

ప్రజాశక్తి - విజయవాడ : వరద ప్రాంతాల్లో ఈనెల విద్యుత్ రీడింగులు తీయలేకపోయామని, రెండు నెలల సగటున అక్టోబర్‌లో రెండు నెలల బిల్లు చెల్లించాలని విద్యుత్ శాఖ (సిపిడిసిఎల్) వినియోగదారులకు, వరద బాధితులకు నోటీసులు పంపింది. ఒకపక్క బుడమేరు వరదలతో బాధితులు సర్వస్వం కోల్పోవడంతోపాటు లక్షలాది రూపాయల మేర ఆస్తి నష్టం జరిగింది. మరోపక్క ఉపాధి లేదు, చేతిలో చిల్లిగవ్వలేకపోగా, ప్రభుత్వం నుండి నయాపైసా సాయం అందలేదు. బాధితులను ఆదుకుంటామని ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు చేసి చేతులు దులుపుకున్నారు. బాధితులను ఆదుకోకపోగా, విద్యుత్ శాఖాధికారులు కరెంట్ బిల్లుల తాఖీదులు పంపడాన్ని బాధితులు జీర్ణించుకోలేకపోతున్నారు. రెండు బిల్లుల చెల్లింపునకు అక్టోబర్ మొదటివారం అంటే మరో 15 రోజులు మాత్రమే గడువు ఉంది. బాధితుల చేతుల్లో చిల్లిగవ్వలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కరెంట్ బిల్లులు, ఇంటి పన్నుల పేరుతో వసూళ్లకు పూనుకోవడం శోచనీయం. ఈనెల 10న సిఎం చంద్రబాబును సిపిఎం రాష్ట్ర నాయకత్వం కలిసి వరద ప్రాంతాల్లో ఆగస్టు, సెప్టెంబర్ విద్యుత్ బిల్లులను పూర్తిగా రద్దు చేయాలని విజ్ఞప్తి చేసింది. అలాగే 2024-25 ఇంటి పన్నులు, మంచినీరు, డ్రైనేజీ ఇతర ఛార్జీలను రద్దు చేయాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ బిల్లుల రద్దుపై ఆదేశాలు ఇవ్వకుండా కొద్ది రోజుల్లో రెండు నెలలు కలిపి కరెంటు చార్జీలు చెల్లించాలని తాఖీదులు పంపడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే 15 రోజుల్లో ఇంటి పన్నులు, మంచినీరు, డ్రైనేజీ ఛార్జీలు చెల్లించాలని విజయవాడ నగరపాలక సంస్థ హుకుం జారీ చేసింది. మున్సిపల్ మంత్రి నారాయణ మూడు నెలలు సమయం ఇస్తామని ప్రకటించారు. కానీ అప్పుడు కూడా కట్టే పరిస్థితి బాధితులకు లేదు.

ఎపిసిపిడిసిఎల్ వారు జారీ చేసిన తాఖీదు

విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి,

వరద ముప్పు ప్రభావిత ప్రాంతాల్లో రీడింగ్ తీయలేని కారణంగా కొన్ని సర్వీసులకు సరాసరి కింద బిల్లులు ఇచ్చాము. ఈ మొత్తాన్ని అక్టోబర్లో సర్దుబాటు చేసి మాత్రమే బిల్లులు కట్టించుకొంటాము. ఈనెల బిల్లులు చెల్లించకపోతే కరెంట్ సరఫరా నిలిపివేస్తాము. **Your electricity bill for USCNO 6425214072603 of SEP-24 is Rs 622 for units 59.Pls pay on or before 30-SEP-2024 without any surcharge.visit www.apcpdcl.in'** ఇది కండ్రిక కాలనీ వినియోగదారునికి పంపిన తాఖీదు.



కండిక్ర ప్రాంతంలో విద్యుత్, ఎలక్ట్రానిక్స్ పరికరాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు సిహెచ్.బాబూరావు, మహిళా సంఘాల నేతలు

విద్యుత్ బిల్లుల వసూళ్లు గర్హనీయం : సిపిఎం

విద్యుత్ బిల్లులు, మంచినీరు, డ్రైనేజీ ఛార్జీల వసూళ్లు సరికాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పేర్కొన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ శాఖలకు పన్నులు వసూళ్లు తప్ప బాధితులను ఆదుకోవడంపై దష్టి లేదని విమర్శించారు. ఇందుకు టిడిపి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని పన్నులు, ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే బాధితుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

రుణాల రీషెడ్యూల్‌కు బ్యాంకులు అంగీకారం

- ప్రభుత్వ అదనపు కార్యదర్శి (ఆర్థిక) జె.నివాస్

ప్రజాశక్తి - విజయవాడ : వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు లబ్ధి చేకూర్చేందుకు బ్యాంకులు ముందుకొచ్చాయని రుణాల రాష్ట్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి (ఆర్థిక) జె. నివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రుణాల రీ షెడ్యూలింగ్ అవకాశం కల్పించాయని తెలిపారు. దీనిపై సంబంధిత బ్యాంకు బ్రాంచీలను సంప్రదించి లబ్ధి పొందాలని కోరారు. రుణాల చెల్లింపులకు సంబంధించి ఏడాదిపాటు మారటోరియం సౌకర్యం కల్పించాయని తెలిపారు. పంట రుణాలు, ఆటో రిక్షా, ద్విచక్రవాహనాల రుణాలు, చిన్న వ్యాపార, వాణిజ్య సంస్థలు, కిరాణా షాపులు, హోటళ్లు, ఇతర చిన్న పరిశ్రమలకు ఈ మారటోరియం వర్తిస్తుందని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరద ప్రభావిత 179 సచివాలయాల పరిధిలోని ప్రజలకు ఈ సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. 179 సచివాలయాల పరిధిలోని గ్రౌండ్‌ఫ్లోర్ కుటుంబాలు రూ.50 వేల వినియోగ రుణాలు పొందవచ్చని, మొదటి అంతస్తు, ఆపై అంతస్తులో ఉన్న కుటుంబాలు రూ.25 వేల వినియోగ రుణాలు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈరుణాలకు 3 నెలల మారటోరియం ఉంటుందని. 36 నెలల్లో రుణాలను తిరిగిచెల్లించొచ్చని ఆయన తెలిపారు. బ్యాంకులను సంప్రదించి అవసరం మేరకు కొత్తగా పంట రుణాలు పొందొచ్చని వెల్లడించారు. అలాగే ఆటోరిక్షాలు, ద్విచక్ర వాహనాలకు రుణాలు, చిన్న వ్యాపార, వాణిజ్య సంస్థలు తమ అవసరాలకు అనుగుణంగా పెట్టుబడికోసం కొత్త రుణాలు పొందొచ్చని తెలిపారు. రుణాలు పొందేందుకు కొత్తగా కొల్లేటరల్ (రుణదాతకు తిరిగి చెల్లింపు హామీ) అవసరం లేదని పేర్కొన్నారు.

పన్నుల వసూళ్ల వాయిదా

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని వరద ప్రభావిత 32 డివిజన్ల పరిధిలో మూడు నెలలపాటు పన్ను వసూళ్లు వాయిదా వేసినట్లు విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు, పురపాలక, పట్టణాభివద్ధి మంత్రి పి.నారాయణ సూచనల మేరకు పన్నుల వసూళ్లను వాయిదా వేసినట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలైన 1, 5, 7, 15, 16, 17, 18, 19, 20, 21, 22, 30, 32, 40, 41, 42, 43, 44, 45, 46, 47, 54, 55, 56, 57, 58, 59, 60, 61, 62, 63, 64 వార్డుల్లో వచ్చే మూడు నెలల వరకు విఎంసికి చెల్లించాల్సిన ఆస్తి తదితర పన్నుల వసూళ్లను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు.

వరద ప్రభావిత జిల్లాగా ఎన్‌టిఆర్

ప్రజాశక్తి - విజయవాడ : వాయుగుండం ప్రభావంతో కురిసిన అత్యంత భారీవర్షాలతో అతలాకుతలమైన ఎన్‌టిఆర్ జిల్లాను వరద ప్రభావిత జిల్లాగా ప్రభుత్వం ప్రకటించింది. చాలాచోట్ల 30 సెంటీ మీటర్లకుపైగా వర్షపాతం 48 గంటల్లో నమోదైంది. అత్యంత భారీవర్షాల కారణంగా కష్ణా నది, మునేరు, బుడమేరుకు పెద్దఎత్తున వరద ముంచెత్తడంతో జిల్లాలోని అధికశాతం ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సాధారణ జనజీవనం అస్తవ్యస్తమైంది. వరదల కారణంగా పలువురు మరణించారు. పశువులు చనిపోయాయి. ఇళ్లు దెబ్బతిన్నాయి. వ్యవసాయ, ఉద్యాన పంటలు నీటమునిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులతోపాటు పరిశ్రమలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎన్‌టిఆర్ జిల్లాలో లక్షల మంది ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం పడిందని రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోదియా వెల్లడించారు.


గాలిలో బెలూన్లు ఎగురవేస్తున్న సిరి

జీరో శాతానికి హెచ్‌ఐవి కేసుల నమోదు

రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పీడీ డాక్టర్ సిరి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : హెచ్‌ఐవి, ఎయిడ్స్ కేసులను జీరో శాతానికి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఏ.సిరి అన్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఎపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డు మీసాల రాజారావు వంతెన వద్ద నుండి బీఆర్టీఎస్ సిగ్నల్ పాయింట్ వరకు 5 కె మారథాన్ రన్ నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సిరి, డీసీపీ గౌతమి శాలిని ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పీడీ సిరి మాట్లాడుతూ రాష్ట్రంలో పదివేల మందికిపైగా హెచ్‌ఐవి బాధితులు ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో 2030 నాటికి జీరో శాతం వ్యాధి వ్యాప్తి నిరోధకమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. రాష్ట్ర స్థాయి మారథాన్ రెడ్ రన్ – 2024 (5 కె రన్)లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు, ఇతర కేటగిరి (ట్రాన్స్ జెండర్) వారు పాల్గొన్నారని తెలిపారు. దీనిలో విజేతలుగా నిలిచిన వారిని నవంబర్ 10న గోవాలో జరిగే 10 కె రన్ జాతీయస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.

5 కె మారథాన్ రాష్ట్రస్థాయి పోటీల విజేతలు

పురుషుల విభాగంలో మొదటి స్థానంలో ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎ.పైడప్పుడు, ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన సీహెచ్.సురేష్, తతీయ స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన వి. రమేష్ నిలిచారు. మహిళల విభాగంలో మొదటి బహుమతిని ఎల్.మేరీ గ్రేస్(విశాఖపట్నం జిల్లా), ద్వితీయ బహుమతిని వి.చెన్ననీల (బాపట్ల జిల్లా), తతీయ బహుమతిని ఎన్.రమ్య జాయ్(బాపట్ల జిల్లా) గెలుపొందారు. ట్రాన్స్ జెండర్ విభాగంలో మన్యం జిల్లాకు చెందిన మెల్లాకా నరేష్ మొదటి స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో మన్యం జిల్లాకు చెందిన గౌడు రమేష్, తతీయ స్థానంలో కర్నూలు జిల్లాకు చెందిన జి.లీలావతి నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేడీలు భాగ్యలక్ష్మి, డాక్టర్ కామేశ్వర్ ప్రసాద్, డాక్టర్ టి.మంజుల, డీడీ డాక్టర్ చక్రవర్తి, ఏడీఎం డాక్టర్ ఉషారాణి, కో ఆర్డినేటర్లు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఆదిలింగం, ఏపీ శాక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

బిసిల అభ్యున్నతికి కృషి : మంత్రి సవిత

ప్రజాశక్తి - వన్‌టౌన్ : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు. విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్లో మంగళవారం నిర్వహించిన విశ్వకర్మ జయంత్యోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. విశ్వకర్మ చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి సవిత మాట్లాడుతూ ప్రపంచ తొలి వాస్తు శిల్పిగా, సష్టికర్తగా విశ్వకర్మ పేరుగాంచారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్, విశ్వకర్మ కార్పొరేషన్ జేఎండి తనూజరాణి, జెఎండి జి.ఉమాదేవి పాల్గొన్నారు.



గొల్లపూడి వరకూ జాతీయ రహదారి విస్తరణ

ప్రజాశక్తి - విజయవాడ : హైదరాబాద్ - విజయవాడ రహదారి పనులు మరో 40 కిలో మీటర్ల మేర పొడిగించే నిమిత్తం కన్సల్టెంట్ల ఎంపికకు ఈ నెల 24 వరకు గడువు ఇచ్చారు. ఆరు వరుసలుగా ఈ జాతీయ రహదారి విస్తరణకు చర్యలు చేపట్టారు. తొలుత హైదరాబాద్ సమీపంలోని దండు మల్కాపూర్ నుంచి జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి వరకు విస్తరించాలని భావించినా, ప్రస్తుతం గొల్లపూడి వరకు పెంచాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ నిర్ణయించింది. తొలుత దండు మల్కాపూర్ నుంచి జగ్గయ్యపేట వరకు విస్తరణ పనులు చేపట్టేందుకు వీలుగా 181.5 కిలోమీటర్లకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్) తయారు చేయాలని ఆదేశాలు జారీచేశారు. తాజాగా గొల్లపూడి వరకు విస్తరించాలని నిర్ణయించి మరో 40 కిలోమీటర్ల పెరుగుదలను దష్టిలో పెట్టుకుని డిపిఆర్ తయారు చేయించాలని నిర్ణయించారు. దీనికి ఈనెల 24వ తేదీని తుది గడువుగా నిర్ణయిస్తూ తాజాగా టెండర్లను కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ఆహ్వానించింది. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్న 17 ప్రమాదకర ప్రాంతాల (బ్లాక్ స్పాట్స్)ను రూ.325 కోట్లతో చక్కదిద్దే పనులను ఇటీవల



జాతీయ రహదారుల సంస్థ చేపట్టింది. ఈ టెండరులో దిద్దుబాటు పనులను మినహాయించినట్లు కేంద్రం ప్రకటించింది. నందిగామ వద్ద నిర్మాణంలో ఉన్న బైపాస్ రోడ్డు పనులను కూడా ఈ టెండరు పరిధి నుంచి తొలగించింది. జగ్గయ్యపేట నుంచి గొల్లపూడి వైపు తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆరు వరుసలకు విస్తరించనుండడంతో వాహనాల రాకపోకలకు ఆటంకాలు తొలగుతాయని జాతీయ రహదారుల సంస్థ అధికారులు చెబుతున్నారు. డిపిఆర్ తయారీ ప్రక్రియకు, కన్సల్టెంట్ గుత్తేదారు ఎంపిక ప్రక్రియకు వచ్చే నెల చివరి వారం నుంచి అధ్యయనం చేపట్టాలని భావిస్తున్నట్లు తెలిసింది.

గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లపై పటిష్ట నిఘా

నేర సమీక్షలో సిపి రాజశేఖరబాబు ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : గంజాయి, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలను అరికట్టేందుకు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖ బాబు అధికారులను ఆదేశించారు. నాటు సారా తయారీ, అక్రమ మద్యం, గంజాయి తదితరాల అక్రమ రవాణాలను అరికట్టాలన్నారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఎన్‌టిఆర్ జిల్లా నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహిళలు, చిన్న పిల్లలపై నేరాలు, వాటి నియంత్రణ, సైబర్ నేరాలు, గంజాయి, మద్యం అక్రమ రవాణా, దొంగతనం, కొట్లాట కేసులు, కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ విధానం, చెడు నడత కలిగిన వారిపై నగర బహిష్కరణలు, అలవాటు పడిన నేరస్తులపై పీడీ యాక్ట్ ప్రయోగం, రోడ్డు ప్రమాదాల నియంత్రణ తదితర అంశాలపై చర్చించారు. సిసిటిఎన్ఎస్‌పై అధికారులకు సిపి తగిన సూచనలు ఇచ్చారు. త్వరలో జరిగే దసరా మహోత్సవాల్లో దర్శనానికి వచ్చే లక్షలాది మందికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈసమావేశంలో సిపి రాజశేఖర బాబు మాట్లాడుతూ ప్రతిరోజూ అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఫుట్ పెట్రోల్లింగ్, విసిబుల్ పోలిసింగ్, ఈ పహారా నిర్వహించి బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్, అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా నిర్మానుష్య ప్రదేశాల్లో


సమావేశంలో మాట్లాడుతున్న సిపి రాజశేఖరబాబు

(చీకటి ప్రదేశాలు, అసాంఘిక కార్యకలాపాలు జరుగు ప్రదేశాలలో) శాంతిభద్రతలు, టాస్క్‌ఫోర్సు, స్పెషల్ బ్రాంచ్, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బందితో సమన్వయం చేసుకుని ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కేసుల దర్యాప్తును త్వరగా పూర్తిచేసి కోర్టుల్లో ఛార్జిషీట్లు ఫైల్ చేసి సిసి నెంబర్లు వచ్చేలా చూడాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులు, విశేషాలు వంటి వాటిని ఉన్నతాధికారుల దష్టికి చేరేలా, ఫిర్యాదుదారులకు చట్టబద్ధంగా త్వరగా న్యాయం జరిగేలా చూడాలన్నారు. బేడ్‌బ్యాచ్, రౌడీ, కెడి, సస్పెక్ట్, గంజాయి సేవించే వ్యక్తులను గమనించి కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరారు. మహిళా సంబంధిత కేసుల్లో ఎటువంటి అలసత్వం వహించొద్దని ఆదేశించారు. దిశా వాహనాల సిబ్బంది నిర్మానుష్య ప్రదేశాల్లో ఎక్కువగా గస్తీ తిరగాలన్నారు. ఈ సమావేశంలో డిసిపిలు గౌతమీ షాలి, కె.ఎం.మహేశ్వర రాజు, కష్ణమూర్తి నాయుడు, అడిషినల్ డిసిపిలు జి.రామకష్ణ, ఏ.వి.ఎల్.ప్రసన్న కుమార్, ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వైభవంగా 'స్వచ్ఛత హి సేవ' ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : నగర పాలక సంస్థ ఆధ్వర్యాన మంగళవారం 'స్వచ్ఛత హి సేవా' కార్యక్రమం వైభవంగా ప్రారంభమైంది. అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విజయవాడ సెంట్రల్ ఎంఎల్‌ఎ బోండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర, స్వచ్ఛ విజయవాడ బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ జి.సమరం పాల్గొన్నారు. ముందుగా స్వచ్ఛత హి సేవ పోస్టర్‌ను, బెలూన్లను విడుదల చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఎ బొండా మాట్లాడుతూ ప్రతిరోజూ మన ఇంటిని, మన పరిసరాలని ఎంతగా పరిశుభ్రంగా ఉంచుకుంటామో అంతకంటే ఎక్కువ పరిశుభ్రంగా మన విజయవాడని ఉంచాలని ఆకాంక్షించారు. స్వచ్ఛత కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమంతట తాముగానీ పరిశుభ్రత పట్ల దఢ సంకల్పంతో ఉండాలన్నారు. స్వభావంలో, సంస్కారంలో స్వచ్ఛత ఉండాలని కోరారు. విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ స్వచ్ఛత హి కార్యక్రమం ప్రారంభమైన గత పదేళ్లలో విజయవాడ నగరపాలక సంస్థ జాతీయ స్థాయిలో 3, 5, 6వ స్థానాలు కైవసం చేసుకుందని గుర్తుచేశారు. దీనికి ముఖ్య కారణం ప్రజలందరి సహకారమేనన్నారు. నగరంలో


జెండా ఊపుతున్న ఎంఎల్‌ఎ బొండా, ఎమ్‌డి గంధం చంద్రుడు, కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు

స్వచ్ఛత హి సేవ కార్యక్రమం అక్టోబర్ 2 వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ముఖ్య అతిథులు మొక్కలను నాటారు. తదుపరి చీపుర్లు పట్టుకొని పరిసరాలను పరిశుభ్రపరిచారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ముఖ్య అతిథులు జెండా ఊపి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో విఎంసి అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సజన, డిప్యూటీ సిటీప్లానర్ జూబిన్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, జోనల్ కమిషనర్లు, వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రాజధాని అమరావతికి భూములివ్వడానికి సిద్ధం

ఎపి సిఆర్‌డిఎ కమిషనర్‌ను కలిసిన రైతు నాయకులు

ప్రజాశక్తి - విజయవాడ : రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం అభివద్ధి పరచే వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూమిని భూ సమీకరణ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివద్ధి ప్రాధికార సంస్థ (ఎపిడిఆర్‌డిఎ)కు ఇచ్చేందుకు తాము సుముఖంగా ఉన్నట్లు పలువురు రైతులు వెల్లడించారు. విజయవాడలోని ఎపిసిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయంలో సంస్థ కమిషనర్ కాటంనేని భాస్కర్‌ను మంగళవారం మల్లెల శేషగిరిరావుతో కలిసి ఉండవల్లి, పెనుమాక, అనంతవరం, మల్కాపురం గ్రామాలకు చెందిన రైతులు కలిసి తమ భూములను భూ సమీకరణ పథకానికి ఇచ్చే విషయమై చర్చించారు. గతంలో ఎదుర్కొన్న చిన్న చిన్న సమస్యలు పరిష్కరిస్తే మరింత మంది ముందుకొస్తారని తెలిపారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ ప్రతి శుక్రవారం అదనపు కమిషనర్ తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, రాజధాని అన్ని గ్రామాల్లో రైతులతో సమావేశమై వారి వ్యక్తిగత సమస్యలు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎపి సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ జి.సూర్య సాయి ప్రవీణ్ చంద్, ల్యాండ్స్ డైరెక్టర్ బి.ఎల్.ఎస్.రాజకుమారి పాల్గొన్నారు.

పేరు సవరణ

నేను వడ్డాది వెంకటేశ్వరరావు, S/o.వడ్డాది యల్లయ్య (రిటైర్డ్ డైరెక్టర్ జనరల్, బి.ఎస్.ఎఫ్.), నివాసం, D.No: 43-125-32, బ్లాక్ నెం: 125, సబ్ స్టేషన్ దగ్గర, అజిత్ సింగ్ నగర్, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా ఆంధ్ర ప్రదేశ్. నా యొక్క పూర్వపు పేరు వడ్డాది వెంకటేశ్వరరావు, S/o. వడ్డాది యల్లయ్య. ఆధార్ కార్డ్ లో నాపేరు తప్పుగా వడ్డాది వెంకటేశ్వరరావుగా నమోదు కాబడ్డది. నా అసలు పేరు **వడ్డాది రాంబాబు స్వామి, S/o. వడ్డాది యల్లయ్య.** కావున నేటి నుండి నా పేరును **వడ్డాది రాంబాబు స్వామి, S/o. వడ్డాది యల్లయ్య** గా మార్పు చెయ్యడం జరిగినది.
(VADDADI RAMBABU SWAMY, S/o. VADDADI YALLAIAH) గా పిలవబడును.
ప్రభుత్వ పెన్షన్ కొరకు ఆధార్ కార్డులో మార్పు కోసం

ప్రకటన
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు, గుడివాడ
ఇ.పి. 75/2022 ఇన్ ఓ.యస్. 43/2020

బిట్వీన్ :
అకురాతి రవికుమార్, తండ్రి : (లేటు) పార్ధసారధి, హిందూ, వయస్సు 53 సం॥లు, వ్యాపారం, గుడివాడ ..... డిహెచ్‌ఆర్

మరియు

రాజులపాటి జయశారద గౌరి, భర్త : రామచంద్రరావు, హిందూ, వయస్సు 48 సం॥లు, గృహిణి, రెసిడెన్స్ ఆఫ్ నిమ్మతోట, బేతవోలు, గుడివాడ మండలం, కృష్ణాజిల్లా .... జె.డి.ఆర్.

పై నెంబరు ఇ.పి.లో డిక్రీ బాకీని రాబట్టుకొనుటకు గాను ఇ.పి. షెడ్యూలు దాఖల ఆస్తిని ది. 03-10-2024వ తేదీన పై కోర్టులో ఉదయం 10-30 గం.లకు వేలం వేయబడును. ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి ది. 01-01-1996 నుండి 07-01-2024 వరకు ఇ.సి. తీసుకొని విచారించగా ఇ.సి. దాఖలా ఎటువంటి అన్యాక్రాంతములు లేక ఫ్రీ ఆఫ్ ఎన్‌కంబ్రెన్స్ గా వేలం కాబడును. కావున ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొని పై కోర్టు వేలంపాట పాడుకొనవలసినదిగా కోరుచున్నాము.

షెడ్యూలు :- కృష్ణాజిల్లా, బేతవోలు గ్రామం, భూషణ గుళ్ళ గ్రామపంచాయతీ, పెద్దపారుపూడి మండలం, గుడివాడ సబ్ రిజిస్ట్రార్ వారి ఇలాకాలో గల రీ.సర్వే నెం. 89లో గల డోర్ నెం. 3-199లో గల 145.3 చ॥గ॥ ఇళ్ళ స్థలానికి హద్దులు:-
హద్దులు : తూర్పు : మెయిన్‌రోడ్డు,
దక్షిణం : వుయ్యూరు రాజ్యలక్ష్మి గారి స్థలం, పడమర : ప్లాట్ నెం. 32, ఉత్తరం : గుమ్మ రమణమ్మ గారి స్థలం
(శ్రీ కోర్టువారి ఆర్డరుప్రకారం)
డిహెచ్‌ఆర్ విలువ : రూ.9,00,000/-
అమీనా విలువ : రూ.10,00,000/-
గుడివాడ — **కె.వి.రామకృష్ణారెడ్డి,**
తేది:16-9-2024 — **అడ్వకేట్, గుడివాడ.**

ఆలయ పరిసరాలు శుభ్రం

ప్రజాశక్తి-మోపిదేవి: పెదకళ్లేపల్లి గ్రామంలో స్వయంభుగా వేంచేసియున్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి దేవస్థానంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు మేరకు స్వచ్ఛ భారత్‌లో భాగంగా మంగళవారం మెయిన్ టెంపుల్ పరిసరముల యందు గల చెత్తను శుభ్రపరచారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల డిప్యూటీ కమీషనర్ కార్యనిర్వణాధికారి నల్లం సూర్య చక్రధరరావు ఆదేశాలను అనుసరించి మోపిదేవి దేవస్థానం లో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు నగదు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలం మర్లపాలెం గ్రామంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన ఇళ్లను మంగళవారం గన్నవరం ఎంఎల్ఏ యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించి లబ్ధిదారులకు అందచేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా లక్ష 80 వేల రూపాయలు లబ్ధిదారులకు ఇవ్వడం జరిగిందని, ఆ సొమ్ముతో లబ్ధిదారులు కల సాకారం అయ్యిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాస్తి వెంకటేశ్వరరావు, జాస్తి మురళీకృష్ణ, కంభంపాటి విశ్వేశ్వరరావు, కంభంపాటి బాబి, నిడమర్తి బుజ్జారావు, కంభంపాటి రాజా, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ పాల్గొన్నారు.

శ్రీ విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత శాఖ ఆధ్వర్యంలో ఆ కార్యాలయంలో మంగళవారం"శ్రీ విశ్వకర్మ" జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిదులుగా విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షులు మానేపల్లి బ్రహ్మాజి, పాల్గొని శ్రీ విశ్వకర్మ విశిష్టత గురించి చెప్పారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-చలపల్లి

కృష్ణానది వరద బాధితులకు గుంటూరు మెడికల్ కళాశాల 1990 బ్యాచ్ వైద్యులు పది లక్షలు విలువ చేసే నిత్యావసరకులు మండలంలోని ఆముదరలక, జువ్వలపాలెం గ్రామాలలో 500 మందికి మంగళవారం స్థానిక ఎంపీ యూపీ పాఠాశాలలో పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు మురళీకృష్ణ, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, వెంకటరమణ, పున్నరావు, సునంద తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాల కల్పనకు తల్లిదండ్రుల ఆందోళన

ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ వైఖరిపై ఆగ్రహం



పోలీసులతో మాట్లాడుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ దుర్గాభవాని వైఖరిపై విద్యార్థినిల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఆందోళన నిర్వహించి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని తండ్రి నాగప్రసాద్ మాట్లాడుతూ ఈ కళాశాలలో ఆడపిల్లలకు సరైన బాత్‌రూమ్ సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులు వెళ్లి అధ్యాపకులను అడిగితే కళాశాలలోకి తల్లిదండ్రులను ఎందుకు తీసుకువస్తున్నారంటూ విద్యార్థినులపై ప్రిన్సిపల్ నోరు పారేసుకుంటున్నారని తెలిపారు. సరైన సదుపాయాలు కల్పించడానికి ప్రిన్సిపాల్ ఏ విధమైన కృషి చేయకపోగా పిల్లలను నోటికొచ్చినట్టు తిట్టడం ఏంటని పఠాన్ గాలి షాహిద్ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల గురించి అడిగేందుకు కళాశాలకు వస్తే నైట్ వాచ్‌మెన్ కోటేశ్వరరావు పిల్లల తల్లిదండ్రులపై దౌర్జన్యం చేస్తే ఆ విషయాన్ని ఖండించకుండా ప్రిన్సిపాల్ పోలీస్‌స్టేషన్‌కి ఫోన్ చేసి రిపోర్టు ఇవ్వడం, పోలీసులను రప్పించడం వెనుక ఆంతర్యం ఏమిటని విద్యార్థిని తండ్రి మోషే ప్రశ్నించారు. నైట్ వాచ్‌మెన్ పగలు ఆడ పిల్లల కాలేజీలో ఎందుకు ఉంటున్నాడని నిలదీశారు. ఈ కళాశాలలో ఆడపిల్లలకు రక్షణ లేదని, పరీక్షల సమయంలో ప్రాక్టికల్స్ చేయడానికి ల్యాబ్‌లు కూడా లేవని చెప్పారు. ఈ విషయమై గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో చర్చించడమే కాకుండా జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్తామని తల్లిదండ్రులు చెప్పారు. అనంతరం పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ తమ టైం టేబుల్ ప్రకారం పిల్లలకు విద్యాబోధన చేస్తున్నామని, ఇంకా అదనంగా టెన్త్ క్లాస్ పిల్లలకు పాఠాలు ఎలా చెప్పగలమని, ప్రిన్సిపాల్ స్థాయిలో ఉండి పిల్లలకు ఒక క్లాస్ కూడా చెప్పని వ్యక్తి తమను మాత్రం అదనంగా క్లాసులు చెప్పమనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ దుర్గాభవాని ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులతో మాట్లాడి పరిస్థితి సర్దుబాటు చేశారు. సమస్యలు ఉంటే ఉన్నతాధికారులతో మాట్లాడాలని కోరారు.

రాజకీయ వేధింపులు ఆపాలి

డిఇఒకు మధ్యాహ్న భోజన కార్మికుల వినతి



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం మండల పరిధిలోని పలు పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను, స్కూల్ స్వీపర్లను తొలగించాలని తమ వారిని నియమించాలని గ్రామంలో అధికార పార్టీ నాయకుల చేస్తున్న వేధింపులను అరికట్టాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ జయరావు మాట్లాడుతూ గత 20 -25 సంవత్సరాల నుండి పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు పని చేస్తున్నారన్నారు. అలాగే పది సంవత్సరాల నుండి స్కూల్ స్వీపర్లు పనిచేస్తున్నారని విరాంత స్కూల్ పేరెంట్స్ కమిటీ వారితో గాని స్కూల్ టీచర్స్ తో గాని ఎలాంటి రిమార్కు లేకుండా ఇప్పటివరకు పని చేస్తున్న కార్మికులను ఏ కారణం లేకుండా తొలగించడం అన్యాయమని అన్నారు .వీరికి ప్రభుత్వం ఆదేశాలు స్పష్టంగా ఉన్నవి ఉద్యోగ నియమక పత్రాలు వీరికి జీతాలు ఇస్తున్నట్లు ప్రతి ఉద్యోగికి బ్యాంక్ అకౌంట్ ఉందన్నారు. వీరు ఏ తప్పు చేయలేదు మీరు విధుల్లో తప్పుగా ప్రవర్తించినట్లుగా స్కూల్ పేరెంట్స్ కమిటీ గాని స్కూల్ హెచ్ఎం నుండి గాని జిల్లా మండల అధికారులకు ఏ విధమైన ఆరోపణలు వీరి పైన లేవన్నారు .ఏ కారణం లేకుండా పాఠశాలలో తమ విధులు నిర్వహిస్తున్న వారిని ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. గ్రామాలలోఅధికార పార్టీ కార్యకర్తలు పార్టీ పెద్దలు మీరు కొనసాగుతున్న ఉద్యోగం నుంచి అనారోగ్యం వలన రాజీనామా చేస్తున్నట్లు బలవంతంగా సంతకం పెట్టమని వీరి మీద ఒత్తిడి చేయటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఎన్నికల అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజకీయ వేధింపులు కక్షపూరిత చర్యలు ఉండవని ఆయన ప్రకటించారు. అలాగే నారా లోకేష్ విద్యాశాఖ మంత్రి మా రాష్ట్ర నాయకులకు స్కీం వర్కర్స్ ని ఎవరిని తొలగించడం ఉండదని అన్ని జిల్లా కేంద్రాలకు సర్క్యులర్ లు పంపించినామని హామీ ఇచ్చారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మిడ్డెమీల్స్ వర్కర్స్ యూనియన్ నాట్యకురాలు, వేంకటేశ్వరమ్మ స్వీపర్సు సి హెచ్ సీతమ్మ టీ భవానీ ,జి నాగరాణి కె నాంచారమ్మ , బండి సుకన్య జ్యోతి పి సీతామహాలక్ష్మి పి అమ్ములు ఉన్నారు.

వరద బాధితులకు పక్కా ఇళ్లు : మండలి



ప్రజాశక్తి-మోపిదేవి: వరద ప్రభావిత గ్రామాల్లో పూరిపాకలు దెబ్బతిన్న బాధితులకు పక్కా గహాలు, ఆయా గ్రామాల్లో నూరుశాతం సీసీ రోడ్లు నిర్మిస్తామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం మోపిదేవి, ఉత్తర చిరువోలులంకల్లో పీఎంఏవై గ్రామీణ పథకం ద్వారా లబ్ధిదారులు నిర్మించుకున్న గృహాలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తర చిరువోలులంకలో ఆయన మాట్లాడుతూ ఇటీవల వరదలకు ముంపు ప్రభావిత గ్రామాల్లో దెబ్బతిన్న అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివద్ధి చేస్తామన్నారు. వరదల తాకిడికి కూలిపోయిన పూరిళ్ల స్థానంలో పక్కా గహాలు మంజూరు చేస్తామన్నారు. నియోజకవర్గంలో నూరు శాతం సీసీ రోడ్ల నిర్మాణానికి కషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తెలిపారు. వైసీపీ హయాంలో గృహ నిర్మాణ శాఖలో కనీవిని ఎరుగని అవకతవకలు జరిగాయని, వాటిపై సమగ్ర విచారణ జరుగుతోందని, బాధ్యులపై తప్పనిసరిగా చర్యలు ఉంటాయన్నారు. తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వేలాది పక్కా గహాలు నిర్మించినప్పటికీ ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా చేసామన్నారు. వైసీపీ హయాంలో జగనన్న కాలనీల పేరుతో నివాస యోగ్యం కానీ స్థలాలు ఎంపిక చేయడంతో నిరుపేదలు గృహాలు నిర్మించుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. నియోజవర్గంలోని అనేక మండలాల్లో గహ నిర్మాణ శాఖ మెటీరియల్ కేటాయింపు లెక్కలు కూడా నేటికీ తేలకపోవటం నాటి అవినీతి అక్రమాలకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోందన్నారు. తమ ప్రభుత్వంలో మంజూరు చేసే లే-ఔట్లు ఖచ్చితంగా లబ్ధిదారులు ఉత్సాహంగా గహాలు నిర్మించుకునే స్థాయిలో నివాసయోగ్యమైన స్థలాలు ఎంపిక చేసి ఫ్లాట్లు కేటాయిస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. ఇటీవల వచ్చిన వరదలు ప్రకాశం బ్యారేజీ కరకట్టల సామర్థ్యానికి మించి వచ్చిన నేపథ్యంలో కరకట్ట ఎత్తు పెంచేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విస్తత కషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నడకుదుటి జననికుమారి, కడవకొల్లు సీతారామాంజనేయులు, టీడీపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, తహసీల్దార్ మేడపాటి శ్రీవిద్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, సర్పంచులు నందిగం మేరీరాణి, చింతా శ్రీనివాసరావు, దిడ్ల జానకి రాంబాబు, హౌసింగ్ డీఈఈ గంధం భానోజీరావు, ఏఈ ధర్మేశ్వరరావు, ఏఈలు ఆది ధర్మేశ్వరరావు, జీ.సురేంద్ర, పంచాయతీ ఈఓ రామ కోటేశ్వరరావు, షేహనా, జనసేన నాయకులు కూరేటి రాఘవ పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించండి : ఎస్‌పి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): సమస్యతో వచ్చిన ప్రజల యొక్క సమస్యలను సానుకూలంగా విని, చట్ట పరిధిలో విచారణ జరిపి, పూర్తిస్థాయి పరిష్కారం అందించేలా ప్రతి ఒక్క అధికారి కషి చేయాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు వారి సమస్యలను ధైర్యంగా తెలుపుకునే అవకాశం కల్పించాలని పోలీస్ అధికారులకు సూచించారు. స్వీకరించిన ఫిర్యాదులను, సమస్యపై విచారణ చేసి పరిష్కారం చూపుతామని అర్జిదారులకు హామీ ఇచ్చారు.



వరద బాధిత జర్నలిస్టులకు చేయూత

ప్రజాశక్తి-గన్నవరం : బుడమేరు వరదల్లో సర్వసం కోల్పోయిన విలేకరులు పులి శ్రీనివాసరావు, సుంకర నివాస్, భూక్యా రాజకుమార్‌లకు గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా సాయం అందచేశారు. మంగళవారం సాయంత్రం గన్నవరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పుణ్యా చారిటీస్ చైర్మన్ జాస్తి పణి భూషణ్ కుమార్ సహకారంతో రూ.5 వేలు, కమ్మ వారి ఐక్య సేవా సమితి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వంట సామాగ్రి, బట్టలు, దుప్పట్లు అందచేశారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుడివాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి), జిల్లా ఉపాధి కల్పన శాఖ, డి ఆర్ డి ఎ - సీడాప్, ప్రభుత్వ ఐటిఐ కళాశాల, గుడివాడ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళా పోస్టర్‌ను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవిష్కరించారు. ఈ నెల 20వ తేదీన జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గుడివాడ లోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, గుడివాడ ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. గౌరీమణి సంయుక్తంగా తెలియజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ జాబ్ మేళాలో, టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్, ముత్తూట్ మనీ లిమిటెడ్, ముక్కు ఫైనాన్షియల్ కన్సల్టింగ్ ప్రైవేటు లిమిటెడ్, వరుణ్ మోటార్స్, రిలయన్స్ డిజిటల్ వంటి ప్రముఖ కంపెనీల వారు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి, ట్రైనింగ్ ఆఫీసర్స్ వేణుగోపాల్, జయరాం, నైపుణ్య అభివద్ధి సంస్థ నుంచి శేషు బాబు, నాగ ఆంజనేయులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): గ్రామాల్లో శానిటేషన్ వర్కర్స్ అందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్లో పంచాయతీరాజ్, వైద్య, మెప్మా తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఈరోజు నుండి జిల్లాలో ప్రారంభమైన స్వచ్ఛతాహి సేవ క్రింద చేపట్టవలసిన కార్యక్రమాలు గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో సఫాయి మిత్ర సురక్ష శివిర్ అంశం క్రింద గ్రామాల్లో శానిటేషన్ సిబ్బంది అందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడానికి గూగుల్ ఫారంలో డేటా సేకరించాలన్నారు. తొలుత కమ్యూనిటీ హెల్త్ సెంటర్ స్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రతి గ్రామంలో శానిటేషన్ వర్కర్స్ అందరికీ సాధారణ వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించాలని, వైద్య పరీక్షల రిపోర్టులను బట్టి మరుసటి రోజు అందరికీ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహింప చేయాలని అన్నారు. టెస్ట్ రిపోర్టులలో మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్య సేవ, తదితర ప్రభుత్వపరమైన కేంద్ర రాష్ట్ర పథకాల క్రింద మెరుగైన చికిత్స అందించుటకు, ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కల్పించదానికి కృషి చేయాలన్నారు. శానిటేషన్ వర్కర్స్‌కు ప్రాథమిక వైద్యం (ఫస్ట్ ఎయిడ్) పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డిపిఓ ఎస్ వి. నాగేశ్వర నాయక్, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జె గీతాబాయి, జెడ్పి సిఈఓ ఆనంద్ కుమార్, పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్, ఎల్డిఎం జయవర్ధన్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్, మెప్మా పీడీ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్యక్రమాలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కంచికచర్లలో పారిశుధ్య చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల గ్రామ పంచాయతీ సిబ్బంది మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కంచికచర్లలో పడకేసిన పారిశుధ్యం శీర్షికతో మంగళవారం ప్రజాశక్తి జిల్లా ఎడిషన్‌లో వెలువడిన కథనానికి మండల స్థాయి అధికారులు స్పందించారు. పంచాయితీ విస్తరణ అధికారి శ్రీనివాస్ గ్రామంలో గొట్టుముక్కల రోడ్, ప్రణీత, ఇందిరా కాలనీలో పర్యటించారు. గ్రామంలో రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగించాలని పంచాయితీ సిబ్బందిని ఆదేశించారు. దీంతో గ్రామ కార్యదర్శి బ్రహ్మం ఆధ్వర్యంలో సిబ్బంది ఇల్లా సుబ్బారావు పర్యవేక్షణలో పారిశుధ్య సిబ్బంది వీధుల్లో పేరుకు పోయిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. వీధుల్లో సున్నం, బ్లీచింగ్ చల్లించారు.

బాధితులకు దుప్పట్లు అందజేత

ప్రజాశక్తి - భవానీపురం : బుడమేరు వరదలకు దారుణంగా నష్టపోయిన వైయస్సార్ కాలనీలో 500 వరద బాధిత కుటుంబాలకు విజయవాడ ఫ్రీ మాసన్స్ ఆధ్వర్యంలో దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. మంగళవారం వైఎస్ఆర్ కాలనీలో ఉన్న శ్రీ గౌతమ్ ఇంగ్లీష్ మీడియం స్కూలు వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఒక్కొక్క కుటుంబానికి 2 దుప్పట్లు, 2 బాత్ టవల్స్‌తో కూడిన దుస్తుల కిట్లను వైయస్ఆర్ కాలనీలో గ్రౌండ్ ఫ్లోరులలో నివాసం ఉంటున్న 500 కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సహాయాన్ని విజయవాడ ఫ్రీ మాసన్స్ వర్షిప్ఫుల్ మాస్టరు లింగిపిల్లి రామకృష్ణ, వర్షిప్ఫుల్ బ్రదర్స్ ఎం.వి.జగన్నాథ్, వైయస్సార్ కాలనీ ఎంపిటిసి కె.సత్యనారాయణ తదితరుల చేతులు మీదుగా అందచేశారు. వరద బాధిత ప్రాంతా ల్లోని టూ వీలర్స్ మెకానిక్‌లకు గల్ఫ్‌స్టార్ ఇంజనాయిల్ కంపెనీ వారు నిత్యావసర సరకులు 5 కేజీల బియ్యం, అందించారు.

బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న మంత్రులు ఫరూక్, జనార్ధన్ రెడ్డి, బేగ్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక పశ్చిమ నియోజకవర్గం 54వ డివిజన్‌లో రాష్ట్ర న్యాయ శాఖ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖల మంత్రి బిసి జనార్ధన్ రెడ్డితో కలిసి వరద ప్రభావిత ప్రాంత బాధితులకు టిడి పి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్.ఎస్.బేగ్ బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అర్షద్ పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.5 లక్షలు సాయం

ప్రజాశక్తి - నందిగామ : చైతన్య విద్యా సంస్థల (చైతన్య జూనియర్ అండ్ డిగ్రీ కాలేజీ, సరస్వతి (చైతన్య ఏసీ క్యాంపస్) జూనియర్ కాలేజీ, ఏకత్వ సిబిఎస్ఇ స్కూల్, కంచికచర్ల) మేనేజ్‌మెంట్, అధ్యాపకులు, విద్యార్థులు సంయుక్తంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల సంభవించిన జల ప్రళయం నిరాశ్రయులైన వరద బాధితుల సహాయార్థం రూ.5 లక్షల చెక్కును విరాళంగా చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్ కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య విద్యా సంస్థల చైర్మన్ అమరనేని రమేష్ బాబు, అమరనేని జ్యోతి, చైతన్య ఏసీ క్యాంపస్ ప్రన్సి పాల్ అమరనేని కార్తీక్, శాంతి ప్రత్యూష, ఏకత్వ సిబిఎస్ఇ స్కూల్ డైరెక్టర్ అమరనేని మనోజ్, సింధూర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పారితోషికాలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి నాగార్జున జూనియర్ కాలేజీలో కట్ల పార్వతి 17 వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు చిన్నది పెట్ల పార్వతి మెమోరియల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు జోనికుమారి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి అతిధులుగా దేవినేని జోని కుమారి, కొండపల్లి జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు డాక్టర్ మామిడి శీతారామారావు, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. విద్యార్థుల క్రమశిక్షణ పట్టుదల ఆత్మవిశ్వాసం నిరంతర కృషి కలిగి ఉండాలని వారు అన్నారు.

ఇసుక లారీలపై కఠిన నిబంధనలు తొలగించాలి


ప్రజాశక్తి, భవానీపురం : ఇసుక లారీలపై విధించిన కఠిన నిబంధనలను వెంటనే తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి పలువురు ఇసుక లారీల యజమానులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం విద్యాధరపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇసుక లారీల యజమానుల సంఘాల నాయకులు వడ్లమూడి వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, అన్నే చిట్టిబాబు, గంగవరపు మురళి, సాంబిరెడ్డి, చుక్కాపు రమేష్, రత్తయ్య, టి.పాపారావు తదితరులు మాట్లాడుతూ ఇసుక లారీలపై విధించిన ఐదు శాతం జిఎస్‌టిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక లారీ కిరాయిలు ఎవరు ఇస్తారో, ఎప్పుడు ఇస్తారో తెలియని రీతిలో ప్రభుత్వ నిబంధనలున్నాయన్నారు. ఇసుక రవాణా చేసే వాహనాలకు విధించిన డిపాజిట్లను వెంటనే రద్దు చేయాలని, రవాణా ఆలస్యమైతే విధించే జరిమానాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. లారీ కిరాయిలు తదితర సమస్యలపై రాష్ట్ర భూగర్భ శాఖా మంత్రి సమక్షంలో రవాణా అధికారులు, కలెక్టర్ తదితర ఉన్నతాధికారులు లారీ యజమానులతో చర్చలు జరపాలని వారు కోరారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో ఇసుక లారీల యజమానులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఇసుక లారీ యజమానులు

కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి - భవానీపురం : మనదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారని బిజెపి జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అన్నారు. మంగళవారం విజయవాడ వన్‌టౌన్‌లోని మాడపాటి క్లబ్‌లో శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో భగవాన్ విశ్వకర్మ జయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి అడ్డూరి శ్రీరామ్‌తో పాటు బిజెపి నాయకులు పైలా సోమినాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కామాక్షి స్వర్ణకార సంఘం సభ్యులను అభినందించారు. స్వర్ణకార సంఘం అధ్యక్షులు కేసనం శివ భావన్నారాయణ మాట్లాడుతూ భగవాన్ విశ్వకర్మ జయంతి రోజున స్వర్ణకారులకు అవార్డులను ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు. నందిపాటి వీరాచారి స్మారకఅవార్డును చలపతి ప్రకాష్‌కి, గోలి వీరచంద్రరావు స్మారకఅవార్డును అవ్వారు బుల్లబ్బాయి, మహమ్మద్ భాషాలకు అందజేసినట్టు తెలిపారు. సేవా కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ,మహిళలకు కుట్టు మిషన్లు, వికలాంగులకు వీల్ చైర్లు, పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పోతులూరి ఆచారి, కార్య నిర్వాహక అధ్యక్షులు కటకం మోహన్ మురళి, కోశాధికారి షేక్ సలీం, గౌరవ సలహాదారులు యంగల శ్రీనివాసరావు, మందరపు సూర్య ప్రకాష్, అందే వరదయ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



కామాక్షి స్వర్ణకార సంఘం విశ్వకర్మ జయంతి వేడుకల దృశ్యం

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - తిరువూరు : విజయవాడ సిపి ఆదేశాల మేరకు తిరువూరు మండ లం మలేల గ్రామంలో పేకాట శిబిరంపై మంగళవారం దాడులు చేసి ముగ్గురుని అరెస్టు చేసినట్లు ఎస్సై సత్య నారాయణ తెలిపారు. తమకొచ్చిన సమాచారంతో సెక్టార్ -2 ఎస్ ఐ వెంకట్రావు సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడిచేసి పేకాట ఆడుతు ముగ్గురుని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.2000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సారా తయారీ కేంద్రాలపై దాడి

ప్రజాశక్తి - తిరువూరు : గంపలగూడెం మండలం, అమ్మిరెడ్డిగూడెం, పెద కొమెర గ్రమాల్లోని కాపు సారా తయారీ కేంద్రాలపై దాడులు చేసి ముగ్గుర్నీ అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ అశోక్ తెలి పారు. అమ్మిరెడ్డిగూడెంలో గుంజి అశోక్, గుంజి గోపిల దగ్గర్నుండి 20 లీటర్ల. నాటు సారాయి 500 లీటర్ల బెల్లపును స్వాధీనం చేసుకుని మధ్యవర్తుల సమక్షంలో బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. పారి పోయిన ముద్దాయి గుంజి అంక రాజు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అశోక్, గోపి లను గంపలగూడెం తహశీల్దార్ ముందు బైండ్ ఓవర్ చేసినట్లు సిఐ తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్పులు

ప్రజాశక్తి - కంచికచర్ల : రెవెన్యూ రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కంచికచర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ పోడియంను తొలగించారు. దీంతో సబ్ రిజిస్టర్ కార్యాలయానికి సరికొత్త కళ సంతరించుకుంది. బ్రిటిష్ కాలం నుండి వస్తున్న సాంప్రదాయాలకు భిన్నంగా మార్పులు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో సబ్ రిజిస్ట్రార్ సీట్ కు ఎత్తుగా దిమ్మ కట్టి దాని చుట్టూ ఎరుపు రంగు క్లాత్ కప్పి ప్రత్యేకంగా ఉండేది. ప్రస్తుత ప్రభుత్వ విధానం ప్రకారం ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఫ్లోరింగ్ కు సమాన ఎత్తులోనే సబ్ రిజిస్టార్ టేబుల్ వేసుకొని ఎదురుగా కుర్చీలు వేసే ఏర్పాటు చేశారు. దీంతో రిజిస్ట్రేషన్ కి వచ్చే ప్రజలు సబ్ రిజిస్ట్రార్ ఎదుట నిలబడి ఉండకుండా ఎదురుగా కూర్చుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసేలా ఏర్పాటయ్యింది.



ఉపాధ్యాయుడికి పితృవియోగం

ప్రజాశక్తి - తిరువూరు : ఎ.కొండూరు మండలం, జీళ్ళకుంట యూపి పాఠశాల ఉపాధ్యాయులు మందడపు శ్రీనివాసరెడ్డి (తిరువూరు సత్య బిఈడీ కళాశాల)కి పితృవియోగం కలిగింది. తండ్రి మందడపు వెంకటరెడ్డి(92) సోమవారం రాత్రి చాట్రాయి మండలం, నరసింహారావుపాలెంలోని తన నివాసంలో వయోభారంతో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు శ్రీనివాసరెడ్డి ఉద్యోగరీత్యా తిరువూరులో ఉంటున్నారు. వెంకటరెడ్డి మృతదేహాన్ని సిపిఎం సీనియర్ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, నాయకులు పి.శ్రీనివాసరావు, కె వి.రత్నం, జెవివి సభ్యులు కాబోలు లక్ష్మణరావు, ధనసుందరావు, సత్య బిఈడీ కళాశాల కరస్పాండెంట్ జల్లెపల్లి పరమేశ్వరరావు, ప్రిన్సిపల్ డి.వేణుగోపాల రాజు, సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు సందర్శించి నివాళులర్పించారు.



దేవాదాయ మంత్రి ఆనంను కలిసిన కమిషనర్, ఇఒ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దేవస్థానంలో అక్టోబర్ 3వ తేదీ నుండి 12 వరకు అత్యంత వైభవంగా నిర్వహించు దసరా - 2024 మహోత్సవాలు పురస్కరించుకొని మంగళవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మరియు కమిషనర్ ఎస్.సత్యనారాయణ, దుర్గగుడి కార్య నిర్వాహ నాధికారి కెఎస్. రామారావు, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కె.రామచంద్ర మోహన్, సిఇ శేఖర్ కలిశారు. దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేస్తున్న దసరా ఏర్పాట్లు గురించి మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి మాట్లాడుతూ యాత్రి కులకు మొదటి ప్రాధాన్యత నిస్తూ ఎటువంటి ఇబ్బంది లేకుండా అమ్మవారి దర్శనం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని, ప్రభు త్వానికి మంచి పేరు తెచ్చేలాగా గతంలో కంటే చాలా మెరుగ్గా అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఎక్క డా అలసత్వంకు చోటు లేకుండా పటిష్ఠంగా ఏర్పాట్లు ఉండాలని సూచనలు చేశారు.

కోళ్ల వ్యర్థాలు పట్టివేత

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణం భారత్ టాకీస్ సెంటర్‌లో కోళ్ల వ్యర్థాల వాహనాన్ని, డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలు మేతగా వేయడా నికి తరలిస్తున్నారని సమాచారం. వాహనాన్ని పోలీసు అధికారులు మంగళవారం అడ్డుకు న్నారు.

అక్రమ రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - నందిగామ : అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని నందిగామ పోలీసులు మంగళవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు సమాచారం మేరకు అశోక్ లేలాండ్ ఏపీ 39 టీవీ 0483 గల్లా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్నిఅడ్డుకున్నారు. వివరాలు డ్రైవర్ని అడగగా అక్రమ బియ్యం లోడ్ చందర్ల పాడు గ్రామానికి చెందిన మాదిరాజు నరసింహారావువి అని చెప్పటంతో ఆ వాహనాన్ని నందిగామ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. **తిరువూరు :** అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యా న్ని తిరువూరు సెక్టార్ -2 ఎస్ఐ వెంక టరావు స్వాధీనం చేసుకుని, స్టేషన్ కు తరలించారు. తిరువూరు బైపాస్ రోడ్డు కోకిలంపాడు వెళ్లే సెంటర్ వద్ద ప్రజా పంపిణీ బియ్యా న్ని ఏపీ 39 టిపి 9659 నెంబర్ గల అశోక్ లైలాండ్ మినీ వ్యాన్ లో అక్రమంగా తరలిస్తు న్నారని వచ్చిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకునట్లు ఎస్ఐ తెలిపారు. వ్యాన్ తో పాటు రెండు టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తర లించి నిందితుడు గుంజా రాంబాబు పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బియ్యాన్ని తిరువూరు నుంచి కొకిలంపాడు తీసుకెళ్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈకా ర్యక్రమంలో పిడీఎస్ డిటి శ్వేత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని భార్యకు చెక్కు అందజేత

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు క్లస్టర్ పరిధిలోని వామకుంట్లలో మృతి చెందిన పాడి రైతు కుటుంబానికి కృష్ణా మిల్క్ యూనియన్ వెల్ఫేర్ ట్రస్ట్ నుండి రూపాయల చెక్‌ను మంగళవారం యూనియన్ పాలకవర్గం జిల్లా సభ్యులు బొట్టు రామచంద్రరావు మంగళవారం లక్ష్మీపురం పాల శీతల కేంద్రంలో అందజేశారు. పాడి రైతు వంగల గోవర్ధన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన గ్రామ పాల సంఘం నుండి పాడి గేదెలకు ఇన్సూరెన్స్ చేయించడంతో ఆ చెక్కును మృతుని భార్య తిరుపతమ్మకు అందజేసినట్లు రామచంద్రరావు తెలిపారు.

ప్రతి విద్యార్థీ ఆల్బెండజోల్ తీసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి ఒక్క విద్యార్థి నులిపురుగులు నివారించే ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు.మంగళవారం నగరంలోని చిలకలపూడి పాండురంగ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ 10 వ తరగతి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆల్బెండజోల్ మాత్రల ప్రయోజనాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కడుపులో ఉన్న నులి పురుగులు ఆల్బెండజోల్ మాత్రం మింగడం వలన బయటకు తొలగిపోతాయని, దాంతో మనం తీసుకునే ఆహారము గాని పోషకాలు గాని శరీరానికి వంటపట్టుతాయని ఆరోగ్యంగా, చురుగ్గా ఉంటామని విద్యార్థులు వివరించడంతో జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపవిద్యాధికారి శేఖర్ సింగ్, ఎం ఈ ఓ గురు ప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కష్ణమూర్తి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. **గన్నవరం:** గన్నవరం మండలం అల్లాపురం గ్రామంలోని ఎంపీపీ స్కూల్ పిల్లలకి, అంగన్వాడీ పిల్లలకి నులుపురుగు నివారణకు టాబ్లెట్లు వేయడం మంగళవారం జరిగింది. ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు, పంచాయితీ ఉప సర్పంచ్ శివప్రసాద్, టీచర్లు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా గుడ్లవల్లేరు, కవుతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రల పరిధిలోనిపాఠశాలలు, కళాశాలల్లో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిడి మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ సుదర్శన్‌బాబు, సూపర్వైజర్ తాతినేని వెంకటాద్రి, అనురాధ, సత్యనారాయణ పాల్గొన్నారు. **పెదపారుపూడి:** మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ప్రభుత్వ పాఠశాలలలో, అంగనవాడి కేంద్రాలలో వైద్య సిబ్బంది నులి పురుగుల నివారణకు ఆల్బెండ్ జోల్ టాబ్లెట్లు పంపిణీ చేసినట్టు యలమర్రు పిహెచ్సి వైద్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. **పమిడిముక్కల:** మండలంలోని కపిలేశ్వరపురం వీరంకిలాకు పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో అంగన్వాడీ పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా టాబ్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమోహన్, బొల్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





సంచార విజ్ఞాన ప్రదర్శన

ప్రజాశక్తి-కోడూరు: నాగాయలంకలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియం బెంగళూరు వారు సంచార విజ్ఞాన ప్రదర్శన కేంద్రాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగాయలంక మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు ఈ సంచార విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి కొత్త విషయాలు తెలుసుకున్నారని నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-చల్లపల్లి: డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు తల్లి ఈశ్వరమ్మ ఆరవ వర్ధంతి సందర్భంగా స్థానిక సియోను వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఈఓఆర్డీ దాసి సీతారామరాజు, దళిత నేత బుల్లా కిషోర్, జర్నలిస్ట్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావు పాల్గొన్నారు.



20 నుంచి షటిల్ పోటీలు

ప్రజాశక్తి-గన్నవరం: ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 20, 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కెవిఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వి రమణ, కార్యదర్శి కె.వి.ఆర్ కిషోర్ మంగళవారం తెలిపారు. ఈ పోటీలు సొసైటీ పేటలోని కెవిఆర్ షటిల్ ఇండోర్ స్టేడియంలో ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి జరుగుతాయన్నారు. ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించాలన్నారు. ముగింపు రోజున గన్నవరం డిఎస్పి చలసాని శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేస్తారన్నారు. రెండు విభాగాలలో గెలుపొందిన టీములకు నగదు బహుమతులు ఇస్తామని తెలిపారు. క్రీడాకారులు తమ ఎంట్రీలను ఈనెల 19 వ తేదీ ఐదు గంటల్లోపు రిజిస్ట్రేషన్ చేసుకోగలరని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9885068099, 9177105146, 7981261897 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి-గన్నవరం: ముస్తాబాద గ్రామం లోని హైస్కూల్ వద్ద గల మసీదు కొండపై వెలసి ఉన్న ముస్తఫా వలి అవులియా కరం వారి 59 వ ఉరుసు మహోత్సవం గంధం ఊరేగింపు ఈ నెల 18 వ తేదీ బుధవారం రాత్రి పది గంటలకు జరుగుతుందని ముజావర్లు తెలిపారు. 19వ తేదీ గురువారం సాయంత్రం 6 గంటలకు దర్గా వద్ద దీపారాధన అనంతరం మిలాద్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వావిలాల గోపాలకృష్ణయ్య జయంతి

ప్రజాశక్తి-గుడివాడ : నిస్వార్థానికి నిలువెత్తు ప్రతిరూపం వావిలాల గోపాలకృష్ణయ్య అని డైట్ విశ్రాంత ప్రిన్సిపల్ ఎం.వి ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో స్థానిక వాసవి చౌక్ లోని శ్రీకన్యక పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని మినీ కళ్యాణ మండపంలో అధికార భాషా సంఘం తొలి అధ్యక్షుడు వావిలాల గోపాలకృష్ణయ్య 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీ వేత్త ముదిగొండ నాగ వీరభద్ర శాస్త్రికి వావిలాల గోపాలకృష్ణయ్య పూర్తి పురస్కారం 2024ను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి అయితా గోపాలకృష్ణమూర్తి, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బొగ్గరపు తిరుపతయ్య, మానవతా స్వచ్ఛంద సంస్థ నేతలు దండమూడి విజయలక్ష్మి, దండమూడి సీతారామస్వామి, పిన్నమనేని వేణుగోపాలరావు, నందమూరి పద్మజ, అన్నపురెడ్డి గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో రాష్ట్ర జట్టుకు ఎస్‌పిఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి-గుడివాడ: బాపట్ల జిల్లా ఎస్ఎస్ఆర్ అకాడమీ నందు ఆంధ్రప్రదేశ్ ఖో-ఖో సంఘం ఆధ్వర్యంలో అండర్-14 సబ్ జూనియర్ జాతీయ ఖో-ఖో పోటీలకు బాలుర, బాలికల ఖోఖో ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో స్థానిక ఎస్‌పిఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్.భవాని శంకర్, ఎస్.శ్యామ్‌కుమార్‌లు జాతీయ ఖోఖో జట్టుకు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 28 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు జార్ఖండ్ రాజధాని రాంచిలో జరిగే 34వ సబ్ జూనియర్స్ జాతీయ ఖోఖో పోటీల్లో రాష్ట్రజట్టు తరుపున వీరు పాల్గొంటారని కృష్ణాజిల్లా ఖ ఖో సంఘం చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు, వారికి శిక్షణిచ్చిన మడక ప్రసాద్‌లను కృష్ణాజిల్లా ఖోఖో సంఘం మద్దినేని సత్య ప్రసాద్, గుడివాడ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారిణి పద్మరాణి, డీసీపీ సెక్రటరీ షేక్ జాన్ సాహెబ్, విద్యా కమిటీ చైర్‌పర్సన్ తేలు శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయని టిఎంఈ రాణి, పాఠశాల సిబ్బంది అభినందించారు.



ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కానూరులోని ఫెడరల్ స్కిల్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్లో టాలీ కోర్సుపై సర్టిఫికేట్‌తో కూడిన ఉచిత శిక్షణతో పాటు ఖచ్చితమైన ఉద్యోగావకాశాలకు సంబంధించి అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు తెలిపారు. ఈ శిక్షణలకు బి.కామ్, బీఎ, బీబీఎ, ఎమ్.కామ్ పూర్తి చేసిన 18 నుండి 30 సంవత్సరాల అభ్యర్థులు అర్హులు అని తెలియజేసారు. ఈ నెల 20న శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రముఖ ప్రైవేటు రంగ సంస్థలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా కానూరు తులసినగర్‌లోని ఫెడరల్ స్కిల్ అకాడమీ ట్రైనింగ్ సెంటర్లో వివరాలు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు 8714692747 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అర్హులందరికీ ఇళ్లు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన (పీఎంఎవై) పట్టణ, గ్రామీణ సమాజంలోని బలహీన, తక్కువ ఆదాయ వర్గాలు, పేదలకు అందుబాటు ధరలో గృహాలను అందించాలనే లక్ష్యంతో ప్రారంభించబడిందని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. మంగళవారం భారత ప్రధాని నరేంద్ర మోదీ ఒడిశాలోని భువనేశ్వర్ లో ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0 పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కృష్ణాజిల్లా నుంచి కలెక్టర్ డీకే బాలాజీ కలెక్టరేట్లోని వీసీ హాల్ నుంచి పాల్గొన్నారు.దేశ ప్రధాని భువనేశ్వర్ లోని ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0 పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లాలోని గృహ లబ్ధిదారులకు గృహ మంజూరు పత్రాలు, అదేవిధంగా మంజూరైన గృహాలకు మొదటి విడత నగదు విడుదల పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ వెంకట్రావు, మచిలీపట్నం నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఏచూరికి నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి

సిపిఎం కృష్ణాజిల్లా కమిటీ, మండల కార్యదర్శుల జనరల్ బాడీ సమావేశం మంగళవారం స్థానిక గుంటూరు బాపనయ్య శ్రామిక భవన్‌లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లాకుల లక్ష్మణస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలన్నారు. డిసెంబర్‌లో చల్లపల్లిలో జిల్లా మహాసభ జరిపించాలని జిల్లా కమిటీ నిర్ణయించినట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, అన్ని మండలాల కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తొలుతగా సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి మృతికి సంతాపం ప్రకటించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ అర్పించారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

3 నుంచి తాళం భజన, కోలాటం పోటీలు

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండలం చిట్టూర్పులోని శివాలయం వద్ద దేవీ నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా కృష్ణ జిల్లా, ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో తాళం భజన, మురళీ కోలాటం పోటీ ప్రదర్శనలు అక్టోబర్ 3 నుంచి 11వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం మూడు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గుత్తికొండ వరప్రసాద్ తెలిపారు. ఘంటసాలలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రాచీన భజన సాంప్రదాయాలను ప్రోత్సహించాలని ఆకాంక్షిస్తూ అమ్మవారి మహోత్సవాలు సందర్భంగా చిట్టూర్పులోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో జరిగే ఈ పోటీ ప్రదర్శనలలో ప్రథమ బహుమతి రూ. 10 వేలు, ద్వితీయ బహుమతి రూ. 5 వేలు, తతీయ బహుమతి రూ.3 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీ లోపు భజన సమాచారం పేర్లు, గ్రామాల వివరాలతో పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు .పూర్తి వివరాలకు 9247443763 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో భజన గురువు కర్రిక నాగేశ్వరరావు, లోయ శ్రీనివాసరావు, నిర్వాహక కమిటీ సభ్యులు దాసరి సతీష్, దాసరి సురేష్, యలవర్తి వంశీ, మల్లుపెద్ది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పరిశీలన

ప్రజాశక్తి-ఉయ్యూరు: ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లతో నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ కష్ణనాయక్ అన్నారు. కడవకొల్లు గ్రామ సచివాలయంలో మంగళవారం స్మార్ట్ మీటర్ ఏర్పాటు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ మీటర్ స్మార్ట్ బిల్లింగ్ ఎక్కువ మేనువర్ అవసరం లేకుండా ఆటోమేటిక్‌గా మీటర్ రీడింగ్ తీసుకోవచ్చన్నారు. ఏఈ రూరల్ సత్యనారాయణ, ఆదానీ టీమ్ చందు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి-అవనిగడ్డ: ప్రభుత్వం వాలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకొని పెండింగ్లో ఉన్న వేతనాలను విడుదల చేసి భద్రత కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం మండల పరిధిలోని వాలంటీర్లు ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఎన్డీఏ కూటమి వాలంటీర్లకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేసేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లవలసిందిగా కోరారు. వాలంటీర్లకు పదివేల గౌరవ వేతనం ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలని, గత మూడు నెలలుగా నిలిచిపోయిన గౌరవ వేతనాన్ని వెంటనే విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 50 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.



వాటర్ ఫిల్టర్, నగదు వితరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గుండబోయినపాలెం గ్రామానికి చెందిన బిల్డర్ జవ్వాజి చెన్నకేశవరావు, పుష్పావతి మనుమడు యువన్ మొదటి జన్మదినం సందర్భంగా సోమవారం జగ్గయ్యపేట పట్టణంలోని అన్న క్యాంటిన్‌కి రూ.40వేలు విలువ గల వాటర్ ఫీల్టర్, అన్నదానానికి రూ.10వేలు టిడిపి జిల్లా అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరామ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గింజుపల్లి రమేష్, పద్మనాభుని కుటుంబరావు, ధూళిపాళ్ల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంలో బహిరంగ వేలం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో వేంచేసియున్న శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానానికి చెందిన (1) కొబ్బరి చిప్పలు పోగుచేసుకొను లైసెన్సు (2) తులసీ-పూలు అమ్ముకొను లైసెన్సులకు 4వ సారి వంశపారంపర్య ధర్మకర్త వి.యల్ ఇందిరాదత్తు ఆధ్వర్యంలో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ నెల 19న 1 సంవత్సరం కాలపరిమితికి నడుపుకొనేందుకు దేవస్థాన కార్యాలయంలో సీల్డు టెండరు-కం-బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తిగల వారు దరావతు చెల్లించి వేలంపాటలు, సీల్డు టెండర్లలో పాల్గొనవచ్చుని దేవస్థాన కార్యనిర్వహణాధికారి శిరపరపు హేమలతదేవి తెలిపారు.

ప్రజావేదికలో అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఎంఎల్‌ఎ శ్రీరాం తాతయ్య ఎంఎల్‌సి వేపాడ చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ పాల్గొని ప్రజల వద్ద నుంచి వారు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయానికి తరలివస్తున్న జనం తమ సమస్యలను ఏ కరువు పెడుతున్నారు. కేవలం వినతి పత్రాలు తీసుకోవడంతోనే తమ బాధ్యత తీరినట్లుగా భావించకుండా సంబంధిత అర్జీలను ఆయా శాఖలకు పంపి వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేకమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారన్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని ఉక్కు కళా వేదికలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది ఇల్లు లేక ఇంకా ఇబ్బంది పడుతున్నవారిని వారిని గుర్తించి వారికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఇల్లు మంజూరు చేయించాలని రానున్న రెండు సంవత్సరాల కాలంలో దేశ వ్యాప్తంగా దాదాపు రెండు కోట్ల మంది పేద ప్రజలకు ఇల్లు ఇవ్వడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఇలాంటి ప్రభుత్వంలో భాగస్వామ్యం అవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పుసాల పుల్లారావు, నకిరికంటి వెంకట్, ఇర్రి నరసింహారావు, కర్లపాటి జోజి, గింజుపల్లి వెంకటరావు, సీనియర్ నాయకులు మైనేని రాధ, మున్సిపల్ కమిషనర్ రామ్మోహన రావు, అధికారులు, సచివాలయం సిబ్బంది, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాఘవేంద్ర

రెడ్యా నాయక్ తండాలో సిపిఎం, ప్రజా సంఘాల ఆహార కేంద్రం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని రెడ్యా నాయక్ తండ గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలు, వరదల వల్ల గ్రామంలోని విపరీతమైన నష్టం వాటిల్లింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామంలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని సిపిఎం సీనియర్ నాయకులు కోటా కృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్‌మియా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదలకు పాలేరు పొంగిపొర్లి బూదవాడతో పాటు రెడ్యా నాయక్ తండా గ్రామంలో అనేక ఇళ్లు నేలమట్టం కావటం, ఇళ్ల గోడలు పడిపోయాయని, ఇంట్లోని సామాన్లు, గ్యాస్ బండలు, బట్టలు, కుట్టు మిషన్లు, బియ్యం, ధాన్యం వరద ఉధృతికి కొట్టుకొని పోయాయి అన్నారు. పంట భూములు సైతం కొట్టుకొని పోయి తీవ్ర నష్టం వాటిల్లిందని, పంటలు మునిగిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని తక్షణమే ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారాన్ని అందించాలన్నారు. వరదల వల్ల ఇబ్బందులు పడిన వారిని ప్రభుత్వం ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వరదల వల్ల పాలేరు నుండి రానున్న కాలంలో మరింత నష్టం జరిగే అవకాశం ఉందని తక్షణమే బూదవాడ, రెడ్యానాయక్ తండ గ్రామాలకు శాశ్వత పరిష్కారంగా ఇరువైపులా రిటర్నింగ్ వాల్ నిర్మించి భవిష్యత్తులో వరదల నుండి ఈ గ్రామాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వివి.రాంప్రసాద్, కోటా రవికుమార్, దంతాల నరేంద్ర, భూశమ్మ, బాలు, షేక్ మీరా సాహెబ్, సిఐటియు నాయకులు ఎస్.రామనాథం తదితరులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న నాయకులు

పారిశుధ్య కార్మికుడికి సిఐటియు నివాళి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : జ్వరంతో మృతిచెందిన పారిశుధ్య కార్మికుడు కంపా రామదాసుకు సిఐటియు ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు కంపా రామదాసు జ్వరంతో నాలుగు రోజుల నుంచి ఇబ్బంది పడుతూ మృతి చెందారు. డిపార్ట్‌మెంట్ నుంచి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు, మున్సిపల్ కమిషనర్ ఎఇ, ఆర్ఐ, అధికార పార్టీ కౌన్సిలర్లు మృతుడి భార్యకు అందజేశారు. ప్రభుత్వం నుంచి రావలసిన రూ.2 లక్షలు డెత్ సర్టిఫికెట్ రాగానే ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. 15 రోజులు ఎడతెరిపి లేకుండా పనిచేసిన మున్సిపల్ సిబ్బందికి జ్వరం ఒళ్ళు నొప్పులు అధిక పనిచేయడం వల్ల మహిళలకు గుండె నొప్పి , కాళ్లు చేతులు తిమ్మిర్లు రావడం ఇలా అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. నివాళులర్పించిన వారిలో కొండపల్లి మున్సిపల్ వర్కర్స్ బి.అప్పారావు, జి.సురేష్, నరసింహరావు, నాగేశ్వరరావు, నవీన్ సూరిబాబు దేవుళ్ళు, లాలమ్మ పద్మ దుర్గ మల్లేశ్వరి అంజమ్మ కుమారి తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.



రామదాసుకు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మున్సిపల్ వర్కర్స్‌కి తక్షణమే మెడికల్ క్యాంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : సిఐటియు మండల కార్యదర్శి మహేష్

మున్సిపల్ కార్మికులకు తక్షణమే మెడికల్ క్యాంపు పై ప్రత్యేక దష్టి పెట్టాలని సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరికీ మెడికల్ క్యాంపు నిర్వహించాలి. ఆరోగ్యం సైతం లెక్కచేయకుండా గత 16 రోజులుగా పనిలో నిమగ్నమై జ్వరం, కాళ్ళు నొప్పులు, ఒళ్ళు నొప్పులు, చికెన్ గున్యా లాంటి అనారోగ్యం తో మున్సిపల్ వర్కర్లు ప్రాణాపాయ స్థితిలోకి వెళుతున్నారన్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్స్ ప్రజా ప్రతినిధులు మున్సిపల్ వర్కర్స్ మెడికల్ క్యాంపులు ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - వత్సవాయి : అంగన్వాడీ కేంద్రాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూపర్వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని చిట్యాల గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఎందుకు కావాలని అన్నారు. పోషకాహార మస్తావాలో భాగంగా అంగన్వాడి కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు తాళ్లూరు మధు కుమారి, బూదాటి సీత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సహాయం

వత్సవాయి : వరదబాధితుల కోసం మక్కపేట గ్రామంలో శ్రీ సాయి సెంచరీ హైస్కూల్‌లో పాఠశాల విద్యార్థులు సేకరించిన రూ.25వేలు ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేసినట్లు ఎపిపిఎస్‌సి డెమొక్రటిక్ రాష్ట్ర ఛైర్మన్ గొల్లపూడి మోహన్‌రావు అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ ఎపిపిఎస్ఎ డెమోక్రటిక్ రాష్ట్ర ఛైర్మన్ గొల్లపూడి మోహన్ రావుకి చెక్ ద్వారా స్కూల్ కరస్పాండెంట్ కొమరగిరి భరద్వాజ్, ప్రిన్సిపాల్ సవిత, అందజేశారు.

పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : వరదల సమయంలో తమ విలువైన పుస్తకాలను కోల్పోయిన విద్యార్థులకు సెయింట్ జేవియర్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పుస్తకాలు వితరణ చేశారు. మంగళవారం ఫెర్రీలోని విజయశక్తి స్కూల్‌కి చెందిన ఉపాధ్యాయులు తమ సోషల్ మీడియా వేదికగా పేద విద్యార్థుల పరిస్థితిని వివరించారు. స్పందించిన సెయింట్ జేవియర్ 2004-05 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ విద్యాసంస్థలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న పరిస్థితిని చూసి 900 పుస్తకాలను ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తులసి, ఆంజనేయులు, పూర్వ విద్యార్థులు డా.ప్రసాద్ నాయక్, మణి కుమార్, పాల్గొన్నారు.



రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వే వారి ఆధ్వర్యంలో కొటికలపూడి గ్రామంలోని ప్రభుత్వ విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వరదల్లో స్కూలు మొత్తం మునిగిపోయి పిల్లల పుస్తకాలు పోవడంతో పెన్షనర్స్ ఆఫ్ అసోసియేషన్ రైల్వే వారు విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ ఆఫ్ రైల్వే జనరల్ సెక్రెటరీ భాష మాట్లాడుతూ ఎల్లవేళలా ఎవరికి ఏ ఆ కష్టం వచ్చినా మా



పెన్షనర్స్ అందరూ ఉద్యోగస్థులందరం డబ్బులు కూడగట్టుకొని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తూ ఉంటామని, ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో చేశామని చెప్పారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి, భవానీపురం : భవానీపురం పరిధిలోని 11 కె.వి. టీచర్స్ కాలనీ ఫీడర్ లైన్ల మరమత్తులలో భాగంగా ఈనెల 18వ తేదీ బుధవారం ఉదయం 8.00 గంటల నుండి 10.00 గంటల వరకు (2 గంటల) పాటు భవానీపురంలోని టీచర్స్ కాలనీ, అప్నా బజార్ రోడ్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, దర్గా ప్లాట్స్, 450 ఎస్‌ఎఫ్‌టి బ్లాకుల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అన్నదానం

ప్రజాశక్తి - గంపలగూడెం : తోట మూల విగ్రహాల సెంటర్లో ఏర్పాటైన గణనాధుడికి 11వ రోజు మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దేవయాజన శ్రీధరా ఆచార్యులు, రామాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. బుధవారం నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఏచూరికి నివాళి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని జగ్గయ్యపేట నియోజకవర్గ బిఎస్‌పి ఆధ్వర్యంలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జ్ కొదమల ప్రభుదాస్ మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి 50 సంవత్సరాలుగా కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రజల పక్షాన ప్రజా సమస్యలపై పోరాడిన గొప్ప నాయకుడు ఏచూరి అన్నారు. నియోజకవర్గ బి.ఎస్.పి అధ్యక్షులు కె.వి.రత్నం, నాయకులు పాల్గొన్నారు.

అల్తాఫ్ బాబాకు సన్మానం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : వరద బాధితులకు అల్తాఫ్ బాబా చేసిన సేవలు ప్రశంస నీయమని పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వే సంఘం నాయకులు కొనియాడారు. వరద బాధితులకు అల్తాఫ్ బాబా అన్నదానం, ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వివిధ ప్రాంతాలలో ఆహారం ఏర్పాటు చేశారు. షాబుఖారి నిత్య అన్నదాన లంగర్ ఖానా ద్వారా ముంపు ప్రాంత ప్రజలకు భోజనాన్ని అందించారు. ఈ సందర్భంగా అల్తాఫ్ బాబాను శాలువాతో ఘనంగా సన్మానించారు.

స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం

ప్రజాశక్తి విస్సన్నపేట : స్వచ్ఛత హి సేవ కార్యక్రమము లో భాగంగా ఎంపీడీవో వెంకటరమణ ఆదేశాల మేరకు మంగళవారం ప్రారంభోత్సవ కార్యక్రమం విస్సన్నపేట మండలంలో అన్ని గ్రామ పంచాయితీ లలో నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమం విస్సన్నపేట గ్రామ పంచాయితీలో మండల కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవ హారం నిర్వహించారు. పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.



స్వచ్ఛతాహి కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పరిశుభ్రతపై సామాజిక స్పృహ ఉండాలి

స్వచ్ఛతాహి సేవ పక్షోత్సవాల్లో కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-చల్లపల్లి: నేటి బాలలే రేపటి పౌరులు, పరిశుభ్రత, ఆరోగ్యంపై బాల్యం నుండి అవగాహన కల్పించుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యార్థులకు సూచించారు. మంగళవారం నుండి అక్టోబర్ 2 వరకు జిల్లాలో నిర్వహిస్తున్న స్వచ్ఛతాహి సేవ పక్షోత్సవాలు సందర్భంగా అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంగళవారం చల్లపల్లిలో జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద కలెక్టర్ మొక్కలు నాటారు. జడ్పీ హైస్కూల్ వద్ద నుండి చల్లపల్లి సెంటర్ వరకు విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీకి కలెక్టర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం చల్లపల్లి సెంటర్లో మానవహారంగా ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్ విద్యార్థులచే, అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల అవగాహన, తగిన ప్రచారం కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా నేటి నుండి అక్టోబరు 2 వరకు స్వచ్ఛతహి సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా చెత్త పోగయ్యే ప్రదేశాలు (బ్లాక్ స్పాట్స్) గుర్తించి వాటిని తొలగించి శుభ్రం చేయడం, తద్వారా చెత్త శాతం తగ్గించేందుకు, పరిసరాల పరిశుభ్రత పర్యావరణం కాపాడేందుకు పలు కార్యక్రమాలతో పాటు, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ఒక ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు.స్వచ్ఛందంగా చల్లపల్లిని స్వచ్ఛ సుందరంగా తీర్చిదిద్దిన కార్యకర్తలకు అభినందనలు తెలియజేస్తూ, స్వచ్ఛ సుందర చల్లపల్లి స్ఫూర్తిగా జిల్లాలో అన్ని గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ నాగేశ్వర నాయక్, జెడ్పిసిఈఓ ఆనందకుమార్, ఎంపీపీ కోట విజయరాధిక, జడ్పిటిసి రాజులపాటి కళ్యాణి, చల్లపల్లి సర్పంచ్ పైడి పాముల కష్ణకుమారి, డాక్టర్ డి ఆర్ కె ప్రసాద్, ఎంపీడీవో సిహెచ్ చినరాట్నాలు, తాసిల్దారు వనజాక్షి పాల్గొన్నారు. **గుడివాడ** : ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ గుడివాడ రూపకల్పనే తన లక్ష్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రమణ్యం, పురపాలక సంఘ ఉద్యోగులు, మెప్మా ఆర్పీలతో కలిసి ఎమ్మెల్యే రాము స్వచ్ఛతాహి సేవ ప్రతిజ్ఞ చేశారు. **గుడ్లవల్లేరు:** స్వచ్చాతా హి సేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో డి.కృష్ణవేణి మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా అధికారులు అన్ని చర్యలు చేపట్టి అందరు చెత్త పోగు అయ్యే బ్లాక్ స్పాట్స్ గుర్తించాలని, పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించాలని, తద్వారా ఆరోగ్యకరమైన



చల్లపల్లిలో మానవహారం

వాతావరణము చేకూరుతుందని అన్నారు. **అవనిగడ్డ:** మండల పరిధిలోని పులిగడ్డ గ్రామపంచాయతీ పరిధిలో స్వచ్ఛతహి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పులిగడ్డ ప్రధాన కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి అనిత, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్టిపి కుమార్ పాల్గొన్నారు. **కంకిపాడు** : కంకిపాడు జడ్పీ స్కూల్ విద్యార్థులు మంగళవారం మానవహారం నిర్వహించి స్వచ్ఛభారత్ యొక్క ఆవశ్యకతను తెలియజేస్తూ ప్ల కార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత తలపై ప్రజలకు విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి అనూష, కంకిపాడు పంచాయతీ సర్పంచ్ బాకీ రమణ, పి.ఇందిరా, కంకిపాడు పంచాయతీ కార్యదర్శి ఓ రామకృష్ణ పాల్గొన్నారు. తాడిగడప మున్సిపాలిటీ కానూరు గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్, ముప్పా రాజా పాల్గొన్నారు.

వరద బాధితులకు విద్యార్థుల విరాళం



ప్రజాశక్తి-అవనిగడ్డ: ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరదల వల్ల సర్వస్వం కోల్పోయిన వరద బాధిత కుటుంబాల కోసం ఎస్‌విఎల్ క్రాంతి విద్యాసంస్థల విద్యార్థులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి అందజేయడం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రశంసించారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో వరద బాధితుల కోసం సేకరించిన విరాళాలను బుద్ధ ప్రసాద్‌కు అందజేశారు. అందులో జూనియర్ కళాశాల విద్యార్థులు రూ.1.88 లక్షలు, డిగ్రీ కళాశాల విద్యార్థులు రూ.1.16 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు బుద్ధప్రసాద్కు అందజేశారు. ఈ విరాళాలతో మోపిదేవి మండలం కే కొత్తపాలెం వరద బాధితులకు సహాయం అందిస్తామని ఉమామహేశ్వర ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకురాలు ప్రతిష్ట

ప్రజాశక్తి-ఘంటసాల: మండల పరిధిలోని శ్రీకాకుళం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన గోగినేనిపాలెం, శ్రీకాకుళం ఉన్నత పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణా తరగతుల కార్యక్రమాలకు సమగ్రశిక్ష రాష్ట్ర పరిశీలకురాలు ప్రతిష్ట హాజరై, కార్యక్రమ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ సానుకూల దక్పథంతో విద్యార్థులందరికీ ప్రత్యేక శ్రద్ధతో విద్యాబోధన చేయాలని సూచించారు. ఎఫ్.ఎల్.ఎన్. (ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ) యొక్క ఆవశ్యకతను ఉపాధ్యాయులకు వివరించారు. ఈ కార్యక్రమం గోగినేనిపాలెం, శ్రీకాకుళం ఉన్నత పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు తమ్మన వేణుగోపాలరావు, అమిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఘంటసాల మండల విద్యాశాఖాధికారి-2 మొహమ్మద్ మోమిన్ ఈ కార్యక్రమాన్ని సందర్శించారు. రాష్ట్ర సమగ్రశిక్ష పరిశీలకురాలు ప్రతిష్ట ఈ కార్యక్రమ అమలు తీరుపై, తన సంతప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెండు స్కూల్ కాంప్లెక్స్ ల సి.ఆర్.పి లు నిరీక్షణరావు, శ్రీహరి, రెండు కాంప్లెక్స్ ల సెక్రటరీలు ఎం.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వరరావు, స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్స్ ఝాన్సీ, ఎం.శ్రీనివాసరావు, భగవాన్, కె.శ్రీనివాసరావు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బుడమేరు యుటి ఎత్తు పెంచి నిర్మించాలి

ప్రజాశక్తి-గన్నవరం: విజయవాడ రూరల్ మండలం గూడవల్లి బుడమేరు వద్ద యూటి ఎత్తు పెంచాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన యూటీని పరిశీలించారు. విజయవాడ కృష్ణానది నుంచి ఏలూరు కాలవ ద్వారా ఏలూరుకు నీరు వెళ్తుండగా , కేసరపల్లి వద్ద పొలాల నుంచి వెళ్లే మురుగు యూటీ ద్వారా బుడమేరు లోకి పారుతోందని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ రెండు విడివిడిగానే వెళ్లాల్సి ఉందన్నారు. 1902 లో బ్రిటిష్ వాళ్ళు కట్టిన యూటి ని ఇప్పటి అవసరాలకు అనుగుణంగాఎత్తు లేపాల్సి ఉందని అన్నారు. తద్వారా ఏలూరు వెళ్లే నీళ్ల విడిగా, బుడమేరు నీళ్లు అండర్ గ్రౌండ్ గా పారాల్సి ఉందన్నారు. దీని ఎత్తు పెంచకుండా చంద్రబాబు నాయుడు రాత్రిపూట కూడా బొట్లెక్కి తిరగటం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన బుడమేరు పాత యూటీని తీసేసి, ఎత్తు పెంచి నిర్మించకపోతే రాబోయే రోజుల్లో ముప్పు తప్పదని హెచ్చరించారు.





నులిపురుగుల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం మండలం చిన్నాపురం ప్రాథమిక వైద్యశాల వైద్య సిబ్బంది కృష్ణా విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నులిపురుగుల నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నులిపురుగుల నివారణకు సంబంధించిన మందులను పంపిణీ చేశారు. కడుపులో నులిపురుగులు వలన ఎనీమియా వస్తుందని, ఇది పంతొమ్మిది ఏళ్ల లోపు పిల్లల్లో ఎక్కువగా ఉంటుందని, అందువలన పంతొమ్మిది సంవత్సరాల లోపు పిల్లలు అందరూ ఈ మందును వాడాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి ఏడాది ఆగస్టు నెలలో నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేస్తుందని, ఈ ఏడాది వరదల కారణంగా ఆలస్యమైందని తెలియచేసారు. ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బందితో పాటు విద్యార్దులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్తు శాఖ మండల ఏఈ రవి కుమార్ మంగళవారం సాయంత్రం తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ రవి కుమార్ మాట్లాడుతూ ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణా నాయక్ ఆదేశాల మేరకు ఘంటసాల విద్యుత్తు సబ్ స్టేషన్లలో బ్రేకర్లు ఏర్పాటు, మరమ్మత్తులు నిమిత్తం బుధవారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు ఘంటసాల, దేవరకోట, బొళ్లపాడు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. కావునా విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఏఈ రవి కుమార్ కోరారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు : గోపాలకృష్ణ





ప్రజాశక్తి-తోట్లవల్లూరు: మండలంలోని రొయ్యూరు - కంకిపాడు రోడ్డుకు సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించినట్లు గ్రామానికి చెందిన ప్రముఖ టిడిపి నాయకులు ఉప్పులూరు గోపాలకృష్ణ మంగళవారం తెలిపారు. గతంలో ఈ రోడ్డు గుంతలు పడిపోయి కనీసం ద్విచక్ర వాహనాలు నడవడానికి కూడా ఇబ్బందికరంగా తయారైంది. తన సొంత డబ్బులు రూ. 72 వేలతో ఆరు లారీల క్వారీ మెటల్ రోడ్డుకు తోలించి గుంతలను పూడిపించినట్లు తెలిపారు. ఇటీవల వరదలు సంభవించిన కారణంగా సర్వం కోల్పోయిన లంక గ్రామాల ప్రజలకు తన వంతు సహాయంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వరదల కారణంగా ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లోని వరద బాధితులకు సుమారు ఐదు వేల మందికి ఆయన సొంత డబ్బులతో నాలుగు రోజులు భోజనం ఏర్పాటు చేశారు. పిల్లి వానిలంక గ్రామస్తులకు రూ. 18 వేలతో పశువులకు వరిగడ్డి, దాణా ను అందించారు. రూ.50 వేల తో తోడేళ్ల దిబ్బ, కాళింగదిబ్బ లంక గ్రామస్తుల పశువులకు అవసరమైన 400 వరిగడ్డి కట్టలు, మిక్చర్ బ్యాగులను అందించారు. గ్రామంలో ని చిగురుపాటి రామకోటేశ్వరరావు ఇల్లు అగ్నికి ఆహుతై పూర్తిగా సర్వం కోల్పోవడం వలన దాతల సహకారంతో నూతనంగా ఇల్లు కట్టించి ఇచ్చారు. నూతనంగా నిర్మించిన దేవాలయంలో సొంత ఖర్చులతో పాలరాతి నిర్మాణం, అంగన్వాడి పాఠశాలలో ఫర్నిచర్ ఏర్పాటు చేయడం, పశువుల హాస్పిటల్ లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో గ్రామానికి చెందిన ఉప్పులూరు గోపాలకష్ణ ముందుంటూ గ్రామానికి వన్నె తెచ్చినట్లు అవుతుందని పలువురు ఆయన చేసిన సేవలను ప్రశంసిస్తున్నారు.

పకడ్బందీగా మధ్యాహ్న భోజనం అమలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఏలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా అమలయ్యేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యాధికారులను ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీఎం పోషణ్- డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజన పథకం జిల్లా స్థాయి కార్యశాలలో పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి తహేరా సుల్తానా మాట్లాడుతూ జిల్లాలోని 1348 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 87,276 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. జిల్లాలో 96.45 శాతం మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన తింటున్నారన్నారని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి నుంచి భోజనం తీసుకొస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ మధ్యాహ్న భోజనం ప్రాముఖ్యతను తెలియజేసి వారిని చైతన్య పరచాలన్నారు .ప్రతి పాఠశాలలో విద్యార్థులతో పాటు మరీ ముఖ్యంగా మధ్యాహ్నం భోజనం తయారు చేసే వంట ఏజెన్సీలకు కూడా పరిశుభ్రమైన మంచినీటిని అందించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రధానోపాధ్యాయులు పులిహోర వారంలో రెండు రోజులు ఉంటుందని ఒక రోజు తగ్గించాలని, విద్యార్థులు పులిహోర పూర్తిగా తినలేక పోతున్నారని కలెక్టర్ దష్టికి తీసుకువచ్చారు. రోజు ఉడికించిన కోడిగుడ్డు కాకుండా ఒకరోజు పొరుటుగాను, మరొక రోజు కోడిగుడ్డు బజ్జిగాను తయారు చేస్తే పిల్లలు బాగా తినే అవకాశం ఉందని చెప్పారు. రాగి జావాలో బెల్లం సరిగా లేకపోవడంతో విద్యార్థులు దాన్ని ఇష్టపడటం లేదని దానికి బదులు రాగి లడ్డు గాని, రాగి బిస్కెట్లు గాని సరఫరా చేస్తే బాగుంటుందని కలెక్టర్ కు తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఆహార పట్టికలో మార్పులు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుటకు దస్త్రం సిద్ధం చేయాలని కలెక్టర్ జిల్లా విద్యాధికారికి సూచించారు.ఈ కార్యశాలలో జిల్లా విద్యాధికారి తహేరా సుల్తానా, ఏడి మనోహర్ నాయక్, ఉపవిద్యాధికారులు శేఖర్ సింగ్, పద్మారాణి పాల్గొన్నారు.

రూ.63 వేలు పలికిన లడ్డు

ప్రజాశక్తి-గుడివాడ: స్థానిక బంటుమిల్లి రోడ్‌లో యక్కలి మణిదీప్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకుని నవరాత్రుల పందిరి వద్ద లడ్డు ప్రసాదం వేలంపాట మంగళవారం నిర్వహించారు. మండల శతామణిరావు మనమలు రూ.63 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

ముంపు పొలాల పరిశీలన

ప్రజాశక్తి-పెదపారుపూడి

సోమవరప్పాడు, నాగాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మంగళవారం పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను, ఇళ్లను పరిశీలించారు. మాజీ సర్పంచ్ నాగదేశి సునీత ఆధ్వర్యంలోనాయకులు, కార్యకర్తలు బాధితులను కలిశారు.




ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

పర్యావరణ సమతుల్యతకు మొక్కల పెంపకం

ఎన్‌హెచ్‌ఎఐ విజయవాడ ఇన్చార్జి సింగ్

ప్రజాశక్తి - విజయవాడ : పర్యావరణ సమతుల్యతను కాపాడటంతోపాటు జాతీయ రహదారులను సుందరీకరించేందుకు మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టినట్లు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ) విజయవాడ ప్రాంతీయ అధికారి ఆర్‌కె సింగ్ తెలిపారు. విజయవాడ సమీపంలోని చిన అవుటపల్లి వద్ద మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) నిర్మిస్తున్న చిన అవుటపల్లి – గొల్లపూడి బైపాస్ రోడ్లో మంగళవారం ఎన్‌హెచ్‌ఎఐ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సింగ్ మాట్లాడుతూ జాతీయ రహదారుల వెంట పర్యావరణాన్ని కాపాడటంతోపాటు వాహనదారులకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు, శబ్ద, వాయు కాలుష్య నివారణకు తమ సంస్థ కషి చేస్తోందన్నారు. ఎన్‌హెచ్‌ఎఐ విజయవాడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ మొక్కల పెంపకం ద్వారా పర్యావరణాన్ని కాపాడితే దేశానికి సేవ చేసినట్లేనన్నారు. మొక్కల పెంపకంతోపాటు జాతీయ రహదారులను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముందుగా ఎన్‌హెచ్‌ఎఐ, ఎంఇఐఎల్ అధికారులు, సిబ్బంది, స్థానిక పాఠశాల, కళాశాలల విద్యార్థులు మొక్కల పెంపకానికి, వాటి పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎఐ మొక్కల పెంపకం విభాగం ఇన్చార్జి కె.సూర్యనారాయణ, డిజిఎంలు నీరజ గుప్త, కెవిడి రజని, కష్ణమూర్తి, మేనేజర్లు వి.వి.లక్ష్మి, కె.లత, ఎంఇఐఎల్ అధికారులు ఎం.వి.వి.ఎస్.మురళీకష్ణ, రమణాజీ దుర్గ, వివిపి చంద్రశేఖర్, ఎం శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

30న మినీ బ్యూటీ ఎక్స్‌పో

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : స్థానిక ఎస్ఎస్ కన్వెన్షన్‌లో ఈ నెల 30న మినీ బ్యూటీ ఎక్స్ పో నిర్వహించనున్నట్లు ఎస్బిఎంఎస్ అకాడమీ, సైమా ప్రతినిధి రాఘవీ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని ఒక హోటల్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ బ్యూటీ ఎక్స్‌పోనీ ఎస్‌బిఎంఎస్ అకాడమీ, సైమా బ్యూటీ ఎక్స్ పో సంస్థలు సంయుక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎక్స్‌పోలో బాలీవుడ్ సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్టులు జావిద్ హబీబ్, డాక్టర్ ఆమోద్ దోషి పాల్గొంటున్నారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6:30 వరకు కొనసాగే ఎక్స్‌పోలో ప్రత్యేకంగా బాలీవుడ్ సెలబ్రిటీ హెయిర్ కట్స్ సెమినార్స్, ప్రాస్థటిక్, ఎస్ఎఫ్ఎక్స్, లోకల్ సెలబ్రిటీస్ మేకప్ సెమినార్స్ ఉంటాయన్నారు. సైమా (సౌత్ ఇండియా మేక్ ఓవర్ అవార్డ్స్) (గురూజీ, ద మాస్టర్, మామ్ – సూపర్ ఉమెన్ అవార్డులతో పాటు ఎక్స్‌పో అనంతరం ఫ్యాషన్ షో నిర్వహించనున్నామన్నారు. అనంతరం బ్యూటీ ఎక్స్‌పో పోస్టర్‌ను సంస్థ ప్రతినిధులు, పెద్దల సమక్షంలో విడుదల చేశారు. ఈ సమావేశంలో, లిల్లి (పాలకొల్లు), జ్యోతి (విజయవాడ), షహనా, ప్రణవి, రజియా, రుక్సానా, ఒంగోలు ఉదయ, సిరి, తదితరులు పాల్గొన్నారు.



వరద సాయంపై మాట తప్పిన ప్రభుత్వం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ : ఈనెల 17 నుండి వరద బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పి ప్రభుత్వం మాట తప్పిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. విజయవాడ వరద బాధిత ప్రాంతాలైన కండ్రిక కాలనీ తదితర ప్రాంతాల్లో బాబూరావు, సిపిఎం నేతలు పర్యటించారు. పాఠశాలలో బల్లలను శుభ్రం చేశారు. బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. కండ్రికలోని బివి. సుబ్బారెడ్డి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల బల్లలను శుభ్రం చేశారు. కండ్రిక కాలనీలో వివిధ ప్రజా సంఘాలు, సిపిఎం ఆధ్వర్యాన జరిగిన భోజన పంపిణీలో పాల్గొన్నారు. వందలాదిగా బాధితులు, విద్యార్థులు బారులు తీరి భోజనం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఈఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో ఇప్పటికి 1,25,000 మందికిపైగా భోజనం చేశారు. ఈసందర్భంగా బాబురావు మాట్లాడుతూ రాష్ట్రం నుండి ఎన్నికైన బిజెపికి కేంద్రమంత్రి వరద సాయంపై పెదవి విప్పకపోవడం శోచనీయమన్నారు. బాధితుల సహనాన్ని పరీక్షించొద్దని, తక్షణ ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. వరద వచ్చి 17 రోజులైనా ఇప్పటికీ బాధితులకు ఆర్థిక సాయం అందించకపోవడం సరికాదన్నారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ విజయవాడ వచ్చి వెళ్లారని, కానీ వరద ప్రాంతాల్లో పర్యటించలేదని అన్నారు. బాధితులను పరామర్శించలేదన్నారు. వరద సాయంపైనా నోరు విప్పలేదన్నారు. ఫిర్యాదుల స్వీకరణ పేరుతో హడావుడి చేయడం


పాఠశాలలో బల్లలు శుభ్రం చేస్తున్న బాబూరావు, తదితరులు

కాకుండా రాష్ట్ర ప్రభుత్వం అందించిన వరద నష్టపరిహారం అంచనాలపై స్పందించి రూ.10 వేల కోట్లను తక్షణ సాయంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రంపై వత్తిడి తేయాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో ఉన్న పక్షాలు రాజకీయంగా కేంద్రాన్ని నిలదీయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు, ప్రజల సహకారం తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో సాధారణ పరిస్థితి తీసుకురావడానికి విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులను వెన్నాడుతున్న గ్యాస్ కష్టాలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోయి సత్యబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి, సిపిఎం, మహిళా, కార్మిక సంఘాల నేతలు కె.దుర్గారావు, ఝాన్సీ, పిచ్చమ్మ, సావిత్రి, లత, కొండా, ఆశా తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలపై సమీక్ష

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి: దేవస్థానం నందు అక్టోబర్ 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించు దసరా – 2024 మహోత్సవాలు పురస్కరించుకొని మంగళవారం గొల్లపూడిలోని కమిషనర్ వారి కార్యాలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామారావు, ఆలయ అధికారులతో దసరా ఏర్పాట్లు పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవోే అధికారులు ఏర్పాట్ల గురించి ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరించారు. ఈ నేపథ్యంలో ఆయన పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిఈ శేఖర్, ఏడిసి



చంద్రకుమార్, జె ఎస్ఐ (ఎస్టేట్స్) చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ వైదిక సిబ్బంది, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.వి.ఎస్.కోటేశ్వరరావు, లింగం రమాదే, ఎఇఒలు ఎన్.రమేష్, పి.చంద్రశేఖర్, సుధారాణి, బి వెంకటరెడ్డి, జె.శ్రీనివాస్, ఆలయ డిఈలు, ఎఇఇలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎండి ఫోన్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : హెచ్‌ఎండి 105 4జి హెచ్‌ఎండి 110 4జిలను ఇప్పుడు హెచ్‌ఎండి పరిచయం చేసినట్లు హెచ్‌యు ఎండిసిఇఒ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. యూట్యూబ్ మ్యూజిక్, యూట్యూబ్ షార్ట్స్‌ని క్లౌడ్‌ఫోన్ యాప్ ద్వారా మునివేళ్లపై అందించేలా దీనిని తీర్చిదిద్దారని తెలిపారు. ఆధునిక సౌలభ్యం, వినోదాన్ని అందించడానికి రూపొందించబడిందన్నారు. ముందుగా లోడ్‌చేసిన యాప్ ద్వారా ఇంటర్నెట్ యాక్సెస్ లేకుండా సురక్షితమైన యుపిఐ లావాదేవీలను నిర్వహించగల సామర్థ్యం ఉందని తెలిపారు. ఒక సంవత్సరం రీప్లేస్‌మెంట్ హామీతో ఇవి లభిస్తాయని హెచ్‌ఎండి ఇండియా ఎపిఎసి సిఇఒ అండ్ విపి రవి తెలిపారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టరూ!


రెండు చోట్ల ధ్వంసమైన రహదారి

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్లలో నెహ్రూ సెంటర్ నుంచి వీరులపాడు మండలంలోని గ్రామాల మీదగా తెలంగాణాలోని మధిర వెళ్లే అంతరాష్ట్ర ఆర్‌అండ్‌బి రహదారి దాదాపు ఒక కిలోమీటర్ దూరం వరకు పూర్తిగా ధ్వంసం అయింది. ఈ రహదారి గుండానే మండల కేంద్రమైన కంచికచర్ల నుంచి వీరులపాడు మండల పరిధిలోని గ్రామాలకు, తెలంగాణా లోని మధిర, ఖమ్మంకు ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి రోజూ ఈ రోడ్డుపై 5 వేలకు పైగా వాహనాలు, 10 వేల మంది జనాభా రాకపోకలు సాగిస్తుంటారు. కంచికచర్లకు చెందిన వసంత కాలనీ, ఇందిరా కాలనీ, మోడల్ కాలనీ, ప్రణీత కాలనీ వాసులు కూడా ఈ రోడ్డు మార్గంలోనే ప్రయాణించాల్సి ఉంది. ఈ రోడ్డు మార్గంలో ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించాలన్న, ఆటోల ద్వారా ప్రయాణించాలన్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై మోకాటి లోతు గొయ్యిలు పడటంతో ద్విచక్ర వాహనచోదకులు ఈ గోతుల్లో పడి కాళ్ళ చేతులు విరగకొట్టుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ రోడ్డు మార్గంలోనే పలు పాఠశాలలో కళాశాలలో ఉన్నాయి. ఈ మార్గంలోనే ఆయా కళాశాలలు, పాఠశాలల బస్సులు కూడా ప్రయాణిస్తుంటాయి. ఈ మార్గంలో వాహనాల రద్దీ కూడా అధికంగా ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామం నుంచి కంచికచర్ల వరకు రూ.18 కోట్ల వ్యయంతో 16.6కిమీ మేర రోడ్డు నిర్మాణం చేపట్టాలని అంచనా వేశారు. ఈ రోడ్డు వేసే సమయంలో గ్రామాల్లో సిసి రోడ్డు వేసేలా, బిటి రోడ్డు నిర్మించేలా ప్లాన్ రూపొందించారు. కానీ వారి అంచనాలు తప్పి కంచికచర్ల గ్రామ శివారుకు వచ్చేటప్పటికి ఇచ్చిన గ్రాంట్ పూర్తయింది. అక్కడి నుంచి కంచికచర్ల గ్రామం వరకు కిలోమీటర్ మేర సిసి రోడ్డు నిర్మించాల్సి ఉంది. దానిని నిర్మించేందుకు కనీసం కోటిన్నర రూపాయల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. కానీ ఆ కోటిన్నర రూపాయల నిధులు గత ప్రభుత్వంలో మంజూరు కాలేదు. దీంతో రెండున్నర ఏళ్ల పాటు ఈ రోడ్డు నిర్మాణ పనులు పెండింగ్లో పడిపోయాయి. ఈ రోడ్డు విషయమై ఎన్నికల ముందు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఈ కిలోమీటర్ మేర తాత్కాలికంగా బిటి రోడ్డును నిర్మించారు. దీంతో ఈ రోడ్డు నిర్మించిన రెండు మూడు నెలలకే ధ్వంసం కావడం ప్రారంభించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ ప్రాంత ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైన స్పందించి ఈ ఒక్క కిలోమీటరు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



ఎంబిబిఎస్ విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని విష్ణు ప్రియ నగర్‌కి చెందిన మోహిత్ గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ ఫ్రీ సీటు సాధించినందుకు స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ మోహిత్‌కు అభినందనలు తెలిపారు. మోహిత్ డాక్టర్‌గా బీదలకు సేవ చేయాలనీ కోరారు. ఈ సందర్భంగా మోహిత్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకట రత్నం కుటుంబ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు విసిహెచ్. వెంకటేశ్వర్లు, జె.సుధానంద్ పాల్గొన్నారు.



పవర్ లిఫ్టింగ్‌లో తిరువూరు విద్యార్థి విజయం

ప్రజాశక్తి - తిరువూరు : రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తిరువూరు నాగార్జున ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని విజయకేతనం ఎగురవేసింది. ఈ నెల 14,15 తేదీల్లో కోనసీమ జిల్లా, అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 10వ తరగతి విద్యార్థిని వి.సువర్ణ జిల్లా తరపున పాల్గొని 172 కేజీల విభా గంలో, 172 కేజిల బరువును ఎత్తి ప్రథమ స్థానంతో పాటు మెడల్, సర్టిఫికెట్ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ కె.నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.సురేష్, డైరెక్టర్స్ కె.శేషగిరి, డి.హనుమంత రావు, తూము సూరిబాబు తదితరులు సువర్ణను మంగళవారం పాఠశాల ఆవరణలో అభినందించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.